
PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 27.12.2013, శుక్రవారం
సంపుటి : 33 సంచిక : 30
పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

శుభాకాంక్షలు 2014
పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
నూతనసంవత్సర శుభాకాంక్షలు.
- సం/-

## కొత్త సంవత్సరంలో...

# కొత్త రాష్ట్రం లేనట్లే!



### అసెంబ్లీని దాటని తెలంగాణ బిల్లు పార్లమెంటులో పడుతుందా చిల్లు

***ప్రపంచం 2013కు గుడ్‌బై చెప్పడానికి ముస్తాబవుతోంది. 2014కు స్వాగతం పలకడానికి సిద్ధమవుతోంది. ప్రపంచానికేమోగాని 2013, 2014 ఈ రెండు సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా సీమాంధ్రప్రాంత ప్రజల విషయంలో 2013 ఒక చీకటి జ్ఞాపకంగా మిగిలిపోతుంది. రాష్ట్ర విభజనకు బీజంపడింది ఈ సంవత్సరంలోనే. కేంద్రం రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకున్నాక సీమాంధ్రలోని 13జిల్లాల్లో ప్రజల బ్రతుకులే గందరగోళంగా మారాయి. సమైక్య ఆందోళనల మూలంగా జనజీవనమే స్థంభించిపోయింది. ఆర్థికంగానే కాదు అన్ని విధాలుగా ప్రజలను నష్టపరచింది 2013 సంవత్సరం.***


ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలకు 2014 సంవత్సరం కీలకం కాబోతుంది. కేంద్రంలోనే కాదు, రాష్ట్రంలో కూడా కొత్త ప్రభుత్వాల ఏర్పాటు జరగబోయేది ఈ సంవత్సరంలోనే! అంతేకాదు ఓ కొత్త రాష్ట్రం ఏర్పాటుకు కూడా ఈ సంవత్సరమే కీలకం. తెలంగాణ రాష్ట్రం అనేది ఏర్పడితే 2014లోనే ఏర్పడాలి. లేదంటే ఇక తెలంగాణ వెనక్కి పోయినట్లే!

కొత్త సంవత్సరంలో తెలంగాణ ఏర్పడుతుందా? లేదా? అన్నది ప్రశ్న. వాతావరణం చూస్తుంటే తెలంగాణ వచ్చేదానికంటే రాకపోయేదానికే అవకాశాలెక్కువ. ఎందుకంటే కేంద్రం తెలంగాణ బిల్లును రూపొందించిన విధానమే ఆ విధంగా వుంది. హడావిడిగా తెలంగాణ ప్రకటన చేసారు. అంతకంటే ఎక్కువ హడావిడితో తెలంగాణబిల్లును రూపొందించారు. ఈ బిల్లంతా తప్పులతడకే! బిల్లు మొత్తం కూడా తెలంగాణకు దోచిపెట్టి సీమాంధ్రకు అన్యాయం చేసేదిలా వుంది. ఇలాంటి బిల్లును పార్లమెంట్ ఆమోదించడమంటే ఏకపక్షంగా సీమాంధ్రను ఉరితీయడమే. విజ్ఞులైన వారెవరూ ఇలాంటి పద్ధతి పాడూ లేని బిల్లుకు మద్దతు తెలపరు.

ఓ పక్క సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. మార్చి నుండి ఎన్నికల ట్రెండ్ ప్రారంభమవుతుంది. ఏదైనా జరిగితే ఈలోపే జరగాలి. ఇంతవరకు అసెంబ్లీలో తెలంగాణ బిల్లుపై చర్చే మొదలుకాలేదు. అసెంబ్లీలో శాసనమండలిలో ప్రతిసభ్యుడు తన అభిప్రాయం చెప్పాల్సివుంది. తెలంగాణ బిల్లుపై సభ్యులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను రాష్ట్రపతికి పంపించాలి. ఇక పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

(మిగతా 10వ పేజీలో)

## 2004 వై.యస్.ను సీఎంను చేసింది...
## 2014 జగన్‌ను సీఎం చేయబోతుంది!



# 2014 ఎలక్షన్ కింగ్

***ప్రతివ్యక్తి జీవితంలోనూ కొన్ని ప్రత్యేక తేదీలు, ప్రత్యేక సంవత్సరాలు ఉంటాయి. ఒక్కో సంవత్సరంలో ఒక్కొక్కరికి మంచికాలమొస్తుంది. మరి రేపొస్తున్న 2014 సంవత్సరం ఎవరికి మంచి చేయబోతుంది? ఎవరికి సింహాసనాన్ని అందించబోతుంది? ఎవరిని కుర్చీల నుండి కిందకు దించబోతుంది? ఈ ప్రశ్నలన్నింటికి 2014 సంవత్సరంలోనే సమాధానాలు రాబోతున్నాయి.***

సరిగ్గా పదేళ్ల క్రితం 2004సంవత్సరం.. దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డిని ముఖ్యమంత్రిని చేసింది. ఇప్పుడు 2014వస్తుంది. జగన్‌ను ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేయబోతుంది. అయితే ఇక్కడ సందేహం ఒక్కటే! జగన్ ఇప్పుడున్న సమైక్యరాష్ట్రానికి సీఎం అవుతాడా? లేక రాష్ట్ర విభజన జరిగితే తెలంగాణ విడిపోయాక వున్న ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అవుతాడా? ఎన్నికలు ఉమ్మడి రాష్ట్రంలో జరిగినా, విడిపోయిన రాష్ట్రంలో జరిగినా జగన్‌కు తిరుగులేదన్నది నగ్నసత్యం. రాష్ట్ర విభజన

(మిగతా 10వ పేజీలో)

## ఆనంను వదిలి...

# వైకాపావైపు కదిలి..

### నగరంలో కాంగ్రెస్‌కు బీటలు కూలుతున్న ఆనం కోటలు



**ఒకప్పుడు నెల్లూరు నగరంలో ఆనం అనుచరులుగా ముద్ర వేయించుకోవడానికి చాలామంది ద్వితీయశ్రేణి నాయకులు తాపత్రయ పడేవాళ్లు. ఆనంకు ముఖ్య అనుచరులుగా గుర్తింపు తెచ్చుకుని స్థానికంగా ప్రజల్లో తమ పరపతిని పెంచుకునేవాళ్ళు. ఇలా ఆనం కోటరీలో చాలామంది నాయకులుండేవాళ్ళు. 2009ఎన్నికల వరకు కూడా ఈ బ్యాచ్ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకాకు నీడలా వెన్నంటి నడిచింది.**

2009ఎన్నికల తర్వాతే ఆనం శిబిరం నుండి ఒక్కొక్కరుగా బయటకు రాసాగారు. 2009ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలతో అనిల్‌కుమార్‌యాదవ్, పి.రూప్‌కుమార్, మదన్‌మోహన్‌రెడ్డి వంటివాళ్ళు ఆనంను వదిలిపోయారు. జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని పెట్టాక మరికొందరు ఆనం అనుచరులు ఆ పార్టీలో చేరారు.

అయితే వీళ్లంతా దూరమవడం ఒకెత్తయితే వివేకా రెండో తమ్ముడు ఆనం జయకుమార్‌రెడ్డి దూరం కావడం మరో ఎత్తు. ఆనం జయకుమార్‌రెడ్డితో పాటు ఇంకొందరు నాయకులు వెళ్లిపోయారు. ఇంతవరకు సరే... ఆనం సోదరులలో ఐదో బ్రదర్‌గా పేరుగాంచిన నన్నపరెడ్డి పెంచలరెడ్డి ఆనం బ్రదర్స్‌ను వదిలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం విస్మయం గొలుపుతుంది. డిసెంబర్ 26వ తేదీన హైదరాబాద్‌లో వైకాపా అధ్యక్షులు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన వైయస్సార్సీపీలో చేరారు. నన్నపరెడ్డి పెంచలరెడ్డి ఆనం సోదరులను వీడడం ఆశ్చర్యం కలిగించే విషయమే. నా గుండెను చీలిస్తే అందులో ఆనం బ్రదర్స్ కనిపిస్తారనేంతటి అభిమాని పెంచలరెడ్డి. ఇంతకాలం ఆనం కుటుంబంలో ఒకడుగా ఆయనకు గుర్తింపు వుంది. స్టోన్‌హౌస్‌పేటలోని వ్యాపారవర్గాలలో పట్టుంది. దర్గామిట్ట లోని ఏ.కె. నగర్ ప్రాంతంలో తన వదినను ఒకసారి కాంగ్రెస్ కౌన్సిలర్‌గా గెలిపించుకోవడమే కాకుండా, 2005లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 27వ డివిజన్ నుండి ఆయనే స్వయంగా గెలుపొందారు. ఆనం సహకారంతోనే డివిజన్‌లో ఎన్నో అభివృద్ధి పనులు చేసి మంచిపేరు తెచ్చుకున్నాడు. ఆనంతో ఇంత అనుబంధమున్న పెంచలరెడ్డి ఎందుకు వారికి దూరం కావాల్సి వచ్చిందనేది ప్రశ్న. వివేకా వద్ద గతంలో తమకున్న ప్రాధాన్యత ఇప్పుడు లేదనేది ఆయన బాధ. వీరిమధ్య మనస్పర్థలు గతంలో రాజరాజేశ్వరి అమ్మవారి గుడి సమీపంలోని బార్ వివాదంతోనే

(మిగతా 10వ పేజీలో)



PDF Compressor Free Version



# వేగం... అందుకుంటాడా?




రన్నింగ్ రేస్‌లో ఇద్దరున్నారు. రెఫరీ విజిల్ ఊదాడు. ఒకడు పరుగెత్తాడు, ఇంకొకడు 10 సెకన్లు ఆగి పరుగందుకున్నాడు. ఈ గ్యాప్‌ను మెయింటేన్ చేసి ట్రాక్‌లో ముందు పరుగెడుతున్న వ్యక్తిని క్రాస్ చేయాలంటే చాలా శక్తిని కూడదీసుకోవాలి. సర్వశక్తులొడ్డాలి.

ఆత్మకూరులో రాజకీయ రన్నింగ్‌రేస్ అలాగే వుంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాజకీయంగా బాగా పాతుకుపోయాడు. వ్యక్తిగత సంబంధాలను బలోపేతం చేసుకున్నాడు. గ్రామ స్థాయిలో పార్టీ కేడర్‌ను పటిష్ఠం చేసుకున్నాడు. ఆనం ఏ పని చేసినా దానివెనుక రాజకీయం ఉంటుంది. దాదాపు ఐదేళ్లుగా ఆయన ఆత్మకూరులో తిరుగులేని రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు. అయిదేళ్లుగా ఆత్మకూరును కనిపెట్టుకున్న ఆనం రామనారాయణరెడ్డికి అయిదారువారాల క్రితమే ఆత్మకూరు గురించి తెలుసుకున్న మేకపాటి గౌతం రెడ్డికి మధ్య చాలా తేడావుంది. ఆనం ఐదేళ్ల క్రితమే రాజకీయ పరుగు మొదలుపెట్టాడు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ చేసిన పాడు పనులపట్ల ప్రజల్లో వ్యతిరేకత వుందే గాని, ఆనం పట్ల వ్యతిరేకత లేదు. ఇప్పటికిప్పుడు ఆత్మకూరు వైకాపా అభ్యర్థిగా బరిలో దిగిన మేకపాటి గౌతంరెడ్డి ఆయన వేగాన్ని అందుకుంటాడా? ఎన్నికల నాటికి ఆయనను దాటి ముందుంటాడా? అనేదే ప్రశ్న.

జిల్లాలో 10నియోజకవర్గాలకు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సమన్వయకర్తలను కొన్ని నెలల క్రితమే ప్రకటించింది. మిగతా 9నియోజకవర్గాల్లో సమన్వయకర్తలు పాదయాత్రలు, పార్టీ కార్యక్రమాలు జోరుగా నిర్వహిస్తున్నారు. కాని ఆత్మకూరు నియోజకవర్గంలో మాత్రం పార్టీ కార్యక్రమాలే లేకుండా పోయాయి. మేకపాటి గౌతంరెడ్డి చాలా ఆలస్యంగా ఆత్మకూరు సమన్వయకర్తగా రంగంలోకి దిగాడు. నియోజకవర్గ పర్యటనకు శ్రీకారం చుట్టాడు. కాంగ్రెస్ వ్యతిరేకత, జగన్ గాలి అనే రెండు అంశాలను పక్కనపెట్టి చూస్తే ఆనంతో గౌతంపోటీ కొండను పొట్టేలు ఢీకొనడమే. ఇక్కడ జగన్ గాలితో పాటు గౌతం స్వయంకృషి కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. నాయకుడిగా తానేంటో నిరూపించుకోవడానికి ఆయనకున్నది చాలా తక్కువ సమయం. కాలికి చక్రాలు కట్టుకుని తిరిగితేనేగాని ఆనం స్పీడును అందుకోలేడు.

# ఉదయగిరిలో... అనాథగా మిగిలిన కాంగ్రెస్









సంచలన రాజకీయాలకు పేరు గాంచి రాజకీయ చైతన్యానికి వేదికగా నిలిచే ఉదయగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి పూలమ్మిన చోట కట్టెలమ్ముతున్నట్లుగా మారింది.

జిల్లాలో కాంగ్రెస్‌పార్టీకి కంచుకోటలాంటి నియోజకవర్గాల్లో ఉదయగిరి మొదటిస్థానంలో వుంటుంది. తెలుగుదేశంపార్టీ ప్రభంజనం బలంగా వున్నప్పుడు కూడా ఇక్కడ జనం కాంగ్రెస్‌పార్టీని ఆదరించారు. బెజవాడ గోపాలరెడ్డి వంటి నాయకుడు కాంగ్రెస్ అభ్యర్థిగా ఇక్కడ నుండే గెలుపొందారు. అంతెందుకు రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ పెట్టాక 7విడతలు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ 7సార్లలో అధికారికంగా ఉదయగిరి నుండి తెలుగుదేశం అభ్యర్థి గెలిచింది ఒకే ఒకసారి. 1999 ఎన్నికల్లో కంభం విజయరామిరెడ్డి మాత్రమే. అంతకుముందు 1994లో ఆయన తెలుగుదేశం మద్దతుతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా విజయం సాధించారు. 1983లో బీజేపీ గెలిచింది. 1985, 1989, 2004, 2009 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు.

కాంగ్రెస్‌కు గట్టి పట్టున్న ఈ నియోజకవర్గంలో ఇప్పుడు ఆ పార్టీకి సరైన నాయకత్వమే లేకుండా పోయింది. 1985 నుండి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇక్కడ కాంగ్రెస్‌పార్టీని నెట్టుకుంటూ వస్తున్నాడు. 1989లో ఆయన ఒంగోలు లోక్‌సభకు పోవడం, మాదాల జానకిరాం ఉదయగిరికి రావడం జరిగింది. దీంతో ఇక్కడ మేకపాటి నాయకత్వం కనుమరుగై మాదాల జానకిరాం నాయకత్వం వచ్చింది. 1989 నుండి 1999 ఎన్నికల దాకా ఉదయగిరి కాంగ్రెస్‌కు మాదాల నాయకుడిగా వుంటూ వచ్చాడు. 1999 నుండి మళ్లీ సీన్ రివర్స్ అయ్యింది. 1999లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి సీటు రావడంతో మాదాల జానకిరాం తెలుగుదేశంలోకి పోయాడు. ఆ ఎన్నికల్లో మేకపాటి ఓడినా ఉదయగిరి కాంగ్రెస్‌కు పూర్తిస్థాయి నాయకుడిగా నిలబడ్డాడు. 2004, 2009లలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలవడమే కాక మొన్నటి ఉపఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా మూడోసారి విజయం సాధించాడు.

మేకపాటి సోదరులు కాంగ్రెస్‌లో ఉన్నంతకాలం ఆ పార్టీ నాయకత్వం ఇక్కడ బలంగానే వుండింది. వాళ్లు వైకాపాలో చేరాక పార్టీ బాగా బలహీనపడింది. ముఖ్యంగా నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఏక నాయకత్వం లేదు. తెలుగుదేశం నుండి వచ్చిన కంభం విజయరామిరెడ్డి ఇక్కడ కాంగ్రెస్ నాయకుడిగా చెలాయించలేకున్నాడు. కాంగ్రెస్ రాజకీయాలు ఆయనకు వంట బట్టడం లేదు. ఆయన మనసు మళ్లీ తెలుగుదేశం మీదకే లాగుతున్నట్లుగా వుంది. మాదాల జానకిరాం వుంటే గతంలోలాగా స్పీడ్ లేదు. ఆయన నాయకత్వం క్రింద అన్ని వర్గాలవారు కలిసి పనిచేసే అవకాశాలు లేవు. ఇక చెంచలబాబుయాదవ్ లాంటివాళ్లే ఇక్కడ కాంగ్రెస్‌కు నాయకులు. రేపు పార్టీ తరపున పోటీ చేయడానికి బలమైన నాయకులు కనిపించకుండా పోయారు.

# తాగి బండెక్కారా...? బాదేస్తారు!

## నగరంలో ఫలితాన్నిస్తున్న బ్రీతింగ్ అనలైజర్స్



విదేశాలలో మద్యం తాగి వాహనం నడిపితే శిక్షలు కఠినంగా ఉంటాయి. భారీగా జరిమానా ఉంటాయి. డ్రైవింగ్‌లైసెన్సును శాశ్వతంగా రద్దుచేసి పారేస్తారు. ఉదాహరణకు ఇండియాలో ఓ వ్యాపారవేత్త బార్‌లో మద్యం తాగి బయటకొచ్చి తన వాహనాన్ని తానే డ్రైవింగ్ చేసుకుంటూ ఇంటికిపోతాడు. అదే వ్యక్తి వ్యాపారం పనిమీద సింగపూర్ పోయాడనుకుందాం... ఓ రోజు రాత్రి అక్కడ బార్‌లో మద్యం తాగి బయటకొచ్చాడు. పార్కింగ్‌లో తన కారున్నా టాక్సీని పిలిపించుకుని హోటల్‌కు చేరుకుంటాడు. ఇండియాకు, సింగపూర్‌కు వున్న తేడా ఏంటి? ఇండియాలో తాగి బండి నడిపినా ఎవరూ పట్టుకోరు, పట్టుకున్నా లంచం ఇచ్చి కేసులేకుండా చూసుకోవచ్చు. ఒకవేళ కేసు పెట్టినా పరపతి ఉపయోగించి ఏ ఇబ్బంది లేకుండా చేసుకోవచ్చు. ఇండియాలో తాగి బండి నడిపే వారి ధీమా ఇది. అదే సింగపూర్‌లో అయితే ఇలాంటివేమీ పనిచేయవు. ముందు బండి సీజ్‌చేసి, మందుబాబును బొక్కలో తోసి, కేసు రాసేస్తారు. ఆ తర్వాత అతని చావు అతను చావాల్సిందే!

దేశంలో జరుగుతున్న సగం రోడ్డు ప్రమాదాలకు కారణం మద్యమే. మత్తులో వాహనాలు నడుపుతున్నందు వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరుగుతుంది. మద్యం అమ్మకాలను ఎలాగూ నిరోధించలేము. కనీసం మద్యం తాగి వాహనాలను నడిపేవారినన్నా అరికడితే ప్రమాదాలను తగ్గించవచ్చు.

నెల్లూరులో ఈమధ్య రాత్రి 11గంటలయితే పోలీసులు బ్రీత్ ఎనలైజర్స్ పట్టుకుని రోడ్లమీద ఉంటున్నారు. వాహనదారులను ఆపి మద్యం తాగివున్నాడా లేదా అని బ్రీతింగ్ ఎనలైజర్స్ ద్వారా పరీక్షిస్తున్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నవారిపై జరిమానాలు విధిస్తున్నారు. అయితే ఈ తనిఖీలు మూణ్ణాళ్ల ముచ్చట కాకూడదు. నిరంతరం జరుగుతూ ఉంటేనే క్రమేపీ అలవాటు పడుతుంది. మందుబాబుల్లోనూ భయం వస్తుంది. ఒక్క నగరంలోనే కాదు జాతీయ రహదారుల మీద కూడా ఈ విధంగా తనిఖీలు చేస్తే మద్యం మత్తులో జరిగే ప్రమాదాలను చాలావరకు అరికట్టవచ్చు.

# రొయ్యకు వైరస్... రైతుకు మైనస్



వెనామీ రొయ్యలు నిన్నటి వరకు మీసాలు మెలేసాయి. టైగర్, స్కాంపీ సాగులో వున్న ఇబ్బందులు వెనామీలో లేకపోవడంతో రైతులు బాగానే లాభపడ్డారు. గతంలో టైగర్, స్కాంపీ సాగును నమ్ముకుని చాలామందిరైతులు మునిగిపోగా, ఇప్పుడు వెనామీ మీద ఆ నష్టాలను పూడ్చుకుంటున్నారు. అయితే ఏదైనా మోతాదు శృతిమించితే పట్టుతప్పుతుంది. ఇప్పుడు అదే జరిగింది. నిన్నటి సీజన్‌లో కూడా వెనామీ సాగు జిల్లా రైతాంగానికి మంచి లాభాన్ని అందించింది. దాదాపు 500కోట్లకుపైగా రాబడి వచ్చినట్లు తెలుస్తుంది. దీంతో రైతులు వేలంవెర్రిగా వెనామీ సాగు వెంట పడుతున్నారు. వరి పొలాలను సైతం రొయ్యలగుంటలుగా మార్చేస్తున్నారు. ఇప్పుడు వెనామీని కూడా వైరస్ వెంటాడుతుంది. వెనామీ రొయ్యలకు వైరస్ సోకడంతో ఇబ్రియోలాంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చి వెనామి రొయ్యలు మృతిచెందుతున్నాయి. దీంతో రొయ్యల రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల్లూరుజిల్లా వాకాడు మండలంలో ఈ ఏడాది సుమారు 1500హెక్టార్లలో వెనామి రొయ్యల పంటను సాగుచేస్తున్నారు. ఒక ఎకరానికి రొయ్యల సాగుచేయాలంటే సుమారు 10లక్షలరూపాయలు పెట్టుబడి పెట్టాలి. వైరస్‌రాకుంటే మంచి లాభాలను పొందే అవకాశముంది. హఠాత్తుగా వైరస్ సోకడంతో రొయ్య సాగు రైతులు దిగులు చెందుతున్నారు. వాకాడు మండల పరిధిలోని తూపిలిపాళెం, కొండూరు, అందలమాల, ఉప్పరపాళెం, దుగరాజపట్నం, తిరుమూరు, ముట్టెంబాక, కల్లూరు, దుర్గవారం గ్రామాల్లో వెనామి రొయ్యల పెంపకం ఎక్కువగా చేపడుతున్నారు. కోట, చిల్లకూరు, ముత్తుకూరు, టీపీగూడూరు, ఇందుకూరుపేట, అల్లూరు, కావలిరూరల్ మండలాల్లో కూడా విస్తారంగా రొయ్యలసాగు జరుగుతుంది. వైరస్ మూలంగా ఇక్కడి రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మొత్తానికి రొయ్యకు ఇబ్రియో, వైట్‌స్పాట్ వంటి వ్యాధులు విజృంభించడంతో విలువైన మందులు వాడినప్పటికీ ప్రయోజనం శూన్యమని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# బాగుపడుతున్న రహదారి



ఎట్టకేలకు సంగం - కలిగిరిరోడ్డుకు మంచిరోజులొచ్చాయి. సింగిల్‌రోడ్డుగా వున్న ఈ రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చేపనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దాదాపు 30కిలోమీటర్లు దూరమున్న ఈ రోడ్డు మూడు నియోజకవర్గాల పరిధిలో కలుస్తుంది. ఇప్పటివరకు ఇది సింగిల్‌రోడ్డుగా వుండింది.

వర్షాకాలంలో ఈ రోడ్డు తెగిపోవడం, మధ్యలో వున్న కాజ్‌వేలు తెగిపోవడం వంటివి జరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగేది. నెల్లూరు నుండి ప్రకాశం జిల్లాలోని పామూరు, కనిగిరి, దర్శి వంటి ప్రాంతాలకు పోవాలనుకునేవారికి ఇది చాలా అనువైన మార్గం. నెల్లూరు, పామూరుల మధ్య తిరిగే బస్సులు, ఇతర డిపోల బస్సులు పెద్దసంఖ్యలోనే ఈ మార్గంలో నడుస్తున్నాయి. ఇంతకాలం సింగిల్‌రోడ్డు మూలంగా ఈ మార్గంలో ప్రయాణమంటేనే నరకప్రాయంగా ఉండేది. డబుల్‌రోడ్డుగా మ-రిస్తే జర్నీ సుఖవంతంగా ఉంటుంది.

PDF Compressor Free Version



# మా కడుపుల మీద కొట్టొద్దు

## డాక్యుమెంట్ రైటర్స్ నిరసన గళం



స్థిరాస్తుల లావాదేవీలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో సంబంధం లేకుండా మీ-సేవకు ప్రభుత్వం బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తున్నందుకు నిరసనగా రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం పిలుపుమేరకు గురువారం నెల్లూరు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేసారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళాలువేసారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ ఇప్పటికే నకళ్ళు, ఎంకంబరెన్స్ సర్టిఫికేట్లు (ఇసిలు) మీసేవకు అప్పగించిందని మీసేవ సిబ్బందికి సరైన అవగాహన లేక ఇసీలు, నకళ్ళు, మార్కెట్టు విలువలను తప్పులుతో ఇస్తున్నందువల్ల అవి పనికిరాకుండా పోతున్నాయన్నారు. దీనివల్ల ప్రజలు విలువైన సమయంతోపాటు ఇబ్బందులకు గురౌతున్నారు. బ్యాంకు రుణాలకు సంబంధించి అవసరమైన ఇసీల్లో తప్పులు దొర్లుతున్నందు వల్ల రుణాలు మంజూరు కాకుండా నానాఅవస్థలు పడుతున్నారన్నారు. ఎన్నో ఏళ్ళుగా ఉన్నత చదువులు చదువుకుని ఈ వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న తమకు ప్రభుత్వం దస్తావేజులు రిజిస్ట్రేషన్‌ను మీసేవకు అప్పగించడంపై నిరసనగా గురు, శుక్ర, శనివారాల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగకుండా పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దస్తావేజు లేఖరులకు మద్దతుగా స్టాంపు వెండర్లు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు అబ్దుల్‌కరీం, మజహరుద్దీన్, జమీరుద్దీన్, బషీర్, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, దుర్గేష్‌బాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్సార్ క్రికెట్... సూపర్ హిట్



విజయం ఆయన ఇంటిపేరు. వినూత్నం ఆయన వంటి పేరు. ఏ రంగంలో ఏది చేసినా ఆయనకే చెల్లుతుంది. ఆయనే రాజ్యసభసభ్యులు, నెల్లూరు ముద్దుబిడ్డ, విశాఖవాసుల వరాల బిడ్డ కళాబంధు డాక్టర్ టీ.సుబ్బరామిరెడ్డి. నలుగురు మెచ్చే, పదిమంది నచ్చే మంచి కార్యక్రమాలు నిర్వహించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన సారథ్యంలో డిసెంబర్ 21న విశాఖపట్నం ఓ క్రీడాపండుగను జరుపుకుని పరవశించింది. ప్రకృతి వైపరీత్యాలు, తెలంగాణ గొడవల మూలంగా వాయిదా పడుతూ వచ్చిన బాలీవుడ్ వర్సెస్ టాలీవుడ్ స్టార్స్ క్రికెట్ మ్యాచ్‌ను టీఎస్సార్ తన సారథ్యంలో జరిపించారు. విశాఖలో స్టార్‌క్రికెట్‌కు ఆయన ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరిగాయి. చాలామంది విశాఖలో ఈ మ్యాచ్‌ను జరగనివ్వబోమంటూ బెదిరించారు. కాని అందరికీ నేనున్నా, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా నేను చూసుకుంటానని టీఎస్సార్ అందరికీ ధైర్యం చెప్పారు. ఈ తారల క్రికెట్ మ్యాచ్‌ను అందరూ చూడాలనే సంకల్పంతో ఫ్రీపాస్‌లు అందజేశారు. 21వ తేదీ విశాఖ స్టేడియం క్రీడాభిమానులతో కిటకిట లాడిపోయింది. ఆరోజు ఉదయం ఎయిర్‌పోర్టు నుండే బాలీవుడ్, టాలీవుడ్ సినీతారల సందడి మొదలైంది. టీఎస్సార్ క్రీడాకారుడి డ్రెస్‌లో మైదానంలో మెరిసారు. శ్రీ స్వరూపానందేంద్రస్వామి మ్యాచ్‌ను ప్రారంభించారు. మోహన్‌బాబు, జయప్రద, రాజేంద్రప్రసాద్ వంటి తారలు తళుక్కుమని మెరిసారు. ఇక బాలీవుడ్, టాలీవుడ్ ఆటగాళ్ళు మెరవడమే కాదు, తమ సొగసైన ఆటతీరుతో మురిపించారు. కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, రాష్ట్రమంత్రి గంటా శ్రీనివాసరావులు ఎంతో ఆసక్తిగా మ్యాచ్‌ను తిలకించారు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో టాలీవుడ్ జట్టుపై బాలీవుడ్ జట్టు 67పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇక్కడ గెలుపు ఎవరిదన్నది కాదు ముఖ్యం. కొన్ని లక్షలమంది ప్రేక్షకులకు ఓ మంచి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి అందరినీ మెప్పించిన టీఎస్సారే ఆరోజు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్.





# సేవాకార్యక్రమాల్లో ముందుండాలి

## --- జేసీస్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ---



జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) నెల్లూరు టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం డిసెంబర్ 25వ తేదీ నెల్లూరు వప్పులవీధిలోని జేసీస్ భవన్‌లో జరిగింది. జేసీఐ కొత్త అధ్యక్షులుగా చలువాది శరణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కె.వి.సురేష్‌బాబు, ఏ.వి.శేషయ్య, ఎం.సత్యనారాయణ, సాధు శ్రీనివాసులు, టి.వి.సూర్యప్రకాశ్, యం.రవీంద్ర, కార్యదర్శిగా వి.ఇ. మురళీకృష్ణ సంయుక్త కార్యదర్శులుగా యం.సతీష్‌కుమార్, కొండా శ్రీనివాసులు, కోశాధికారిగా ఎన్.వి.మహేష్‌బాబు, జేసీరేట్ అధ్యక్షురాలిగా సి.హెచ్.ఉమారాణి, కార్యదర్శిగా కె.సరస్వతి, ఉపాధ్యక్షురాలిగా పి.ఉషారాణి, కోశాధికారిగా శేగులక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా వి.భార్గవి, జూనియర్ జేసీవింగ్ అధ్యక్షురాలిగా సి.హెచ్.మోనిషా, కార్యదర్శిగా పూర్ణేశ్వరి, కోశాధికారిగా అనీషాలు ప్రమాణస్వీకారం చేసారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ముక్కాల ద్వారకానాథ్, తవ్వా శ్రీనివాసులు, యోగవల్లి, కోట గురుబ్రహ్మం, కోట సత్యనారాయణ, అమరా మోహన్‌రావు, సురేష్‌కుమార్, చింతాల మధుబాబులు హాజరై కొత్త కార్యవర్గాన్ని అభినందించారు. సేవా కార్యక్రమంలో జేసీస్ ఎప్పుడు ముందుండాలని ఆకాంక్షించారు.

# వాకర్స్‌కు ఆరోగ్యంపై అవగాహన



నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్రశెట్టి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అరవింద కిడ్నీ సెంటర్ యం.డి డాక్టర్ ఎస్.ఎల్.వి.నారాయణ రావు మాట్లాడుతూ వీలయినంత తక్కువ పరిమాణంలో ఉప్పు, చక్కెర, నూనెలు ఆహారంలో భాగంగా చేసుకోవాలని పేర్కొన్నారు. మితాహారం ఆరోగ్యంగా జీవించడానికి కారణమవుతుందని తెలిపారు. అలాగే ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ జీవనశైలిని మార్చుకొని భవిష్యత్తును ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎస్.బలరామయ్యనాయుడు, కోశాధికారి స్వర్ణారమేష్‌బాబు, పి.రవిచంద్ర, ఓబులురెడ్డి, హరికృష్ణ, సుందరరామిరెడ్డి, హజరత్‌బాబు, డా॥సత్యనాథ్, డా॥అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాణిజయరాంకు కళాంజలి పురస్కారం




ప్రముఖ సినీనేపథ్య గాయని వాణిజయరాంకు కళాంజలి పురస్కారాన్ని నెల్లూరు టౌన్‌హాలు ఓపెన్ ఆడిటోరియంలో ఈ నెల 29న అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నెల్లూరుజిల్లా ఎస్పీ పివీయస్ రామకృష్ణ సతీమణి శ్రీమతి పి.వీ.కామేశ్వరి, ప్రముఖ సినీరచయిత వెన్నెలకంటి, "లాయర్" వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి చెన్నై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ యంవియస్ ప్రసాద్, మురళీకృష్ణ హోటల్స్ యండి హజరత్‌బాబు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా కళాంజలి అవార్డు-2013ను సాయిచరణ్, మురళీధర్ రావు, వెన్నెలకంటి రాకేందుమౌళి, పావని, సుగంధినికి ప్రదానం చేయనున్నారు. ఉదయం 10గంటల నుండి ఒంటి గంట వరకు సినిమా పాటలు పోటీలను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్నారు. విజేతలకు వాణీజయరాం చేతుల మీదుగా బహుమతి ప్రదానం గావింపబడుతుందని కళాంజలి అనంత్ తెలిపారు. వివరాలకు 9440206839, 8331924924నెంబర్లలో సంప్రదించాలని కోరారు.




PDF Compressor Free Version






## ఇది పద్ధతి కాదు

మితిమీరిన లౌకికవాదం మంచిది కాదు. మెజార్టీ ప్రజల మనోభావాలకు భంగం కలగని రీతిలో అన్ని వర్గాల వారు నడుచుకోవాలి. హిందువులకు తిరుమల ఎంతటి పవిత్ర క్షేత్రమో తెలియనిది కాదు. తిరుమలకు వెళ్లే మార్గంలో ఇస్లామిక్ యూనివర్శిటీ అంటూ అనుమతి లేని కట్టడాలు నిర్మిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? మక్కా మదీనా వంటి ముస్లిం ఆధ్యాత్మిక క్షేత్రాల్లో అన్యమత ప్రార్థనా మందిరాలు నిర్మిస్తే ఒప్పుకుంటారా?

సి. రాజీవి, నెల్లూరు.

## ఎస్.నో.ఆల్‌రైట్!

ఒక వెర్రిబాగులవాడు ఎస్.నో. ఆల్‌రైట్ అనే మూడు ఇంగ్లీషుపదాలను వల్లెవేశాడు. వాటి అర్థం వాడికి తెలియదు. ఒకరోజు పోలీసులు వాడిని దొంగతనం చేశావా? అని అడిగారు. వాడు ఎస్ అన్నాడు ధీమాగా. నీపై కేసు వ్రాస్తున్నాం నీకు అభ్యంతరమా? అన్నారు పోలీసులు. వాడు 'నో' అన్నాడు. అయితే కోర్టుకు హాజరుకావడానికి సిద్ధంగా వుండు అన్నారు పోలీసులు. వాడు 'ఆల్‌రైట్' అన్నాడు. అలా ఉంది కాంగ్రెస్ నేతల ఊతపదం (హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం) దీన్ని ఆసరాగా చూపి. దిగ్విజయ్ అందరి అంగీకారంతోనే రాష్ట్రాన్ని చీల్చి చెండాడుతున్నాం అంటున్నాడు.

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## కక్ష సాధింపే.

కేంద్రం రూపొందించిన తెలంగాణ బిల్లును చూస్తుంటే సీమాంధ్ర జనాల మీద సోనియా గాంధీ వ్యక్తిగత పగతో రగిలిపోతున్నట్లనిపిస్తుంది. ఉన్నదంతా తెలంగాణకు వూడ్చిపెట్టేసి ఆంధ్రావాళ్లను అడుక్కు తినమన్నట్లుగా ఉంది. సీట్ల కోసం దేనికైనా తెగించేందుకు సిద్ధంగా వుంది. ఈ దేశ సంస్కృతి తెలియని సోనియా గాంధీ ఈ దేశ ప్రజలను శాసిస్తూ... వారి జీవితాలను నాశనం చేస్తుంటే చూస్తూ... ఆమె దయతో బ్రతికే రాజకీయనాయకులు బ్రతికేకన్నా సిగ్గుతో చావడం నయం.

బి. మధుసూదన్,
నాయుడుపేట.

## 'ప్రభా'తం

జాతీయ రాజకీయాలలో కాంగ్రెస్‌పార్టీది ఓ విశిష్ట స్థానం. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఎనలేని అనుబంధం ఆ పార్టీది. ఈ దేశానికి స్వాతంత్ర్యం రాకముందు వుండింది. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొంది. స్వాతంత్ర్యం వచ్చాక దేశ రాజకీయాలలో కీలకపాత్ర పోషిస్తూ వచ్చింది. దేశ చరిత్రలో కాంగ్రెస్‌పార్టీకి ఉన్నంతటి స్థానం ఏ పార్టీకీ లేదు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతీయోద్యమ నాయకులందరినీ ఒకే వేదికపై నిలిపి ముందుకు నడిపింది కాంగ్రెస్‌పార్టీయే నవడంలో సందేహం లేదు.

అయితే దేశానికి స్వాతంత్ర్యం రావడంతోనే కాంగ్రెస్ పని పూర్తయ్యింది. కాంగ్రెస్‌ను అక్కడితో ముగించేయాలని మహాత్మాగాంధీ భావించారు. కాని కాంగ్రెస్‌నే వేదికగా చేసుకుని అసలైన రాజకీయాలను అక్కడ నుండే మొదలుపెట్టారు కొందరు నేతలు. ముఖ్యంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్‌పార్టీయేనంటూ ఆ ఇమేజ్‌ను రాజకీయంగా వాడుకోవడం మొదలుపెట్టారు. ఇందులో నెహ్రూ కుటుంబందే ప్రధానపాత్ర. వాస్తవంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ వేరు, ఎన్నో చీలికలు, పేలికల అనంతరం మనం ప్రస్తుతం చూస్తున్న కాంగ్రెస్ వేరు. స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు పోరాడారు. కాని దాని ఇమేజ్‌ను మాత్రం కాంగ్రెస్‌పార్టీ రూపంలో కొన్ని కుటుంబాలు మాత్రమే పొందగలిగాయి.

### పతనమా? పురోగమనమా??

> దేశానికి స్వాతంత్ర్యం రావడంతోనే కాంగ్రెస్ పని పూర్తయ్యింది. కాంగ్రెస్‌ను అక్కడితో ముగించేయాలని మహాత్మా గాంధీ భావించారు. కాని కాంగ్రెస్‌నే వేదికగా చేసుకుని అసలైన రాజకీయాలను అక్కడ నుండే మొదలుపెట్టారు కొందరు నేతలు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఆరున్నర దశాబ్దాలైతే ఇందులో ఒక దశాబ్దకాలం మాత్రమే కాంగ్రెసేతర ప్రభుత్వాలు కేంద్రంలో అధికారాన్ని నడిపి వుంటాయి. మిగతా ఐదున్నర దశాబ్దాల కాలం కాంగ్రెస్‌దే రాజ్యం. ఈరోజు ఈ దేశం ఏదన్నా అభివృద్ధి సాధించివున్నా, లేదా అభివృద్ధి కంటే అవినీతే ఎక్కువ జరిగివున్నా దానికి ప్రధాన బాధ్యత కాంగ్రెస్‌పార్టీదే! ప్రపంచంలో చాలాదేశాలకు మనతో పాటే స్వాతంత్ర్యం వచ్చింది. కాని అభివృద్ధిలో ఆ దేశాలు మనకంటే ఎంతో ముందున్నాయంటే ఇక్కడ వైఫల్యం సుదీర్ఘకాలం పాటు దేశాన్ని ఏలిన కాంగ్రెస్‌దేనని చెప్పుకోవచ్చు. కాంగ్రెస్ నేతలు సభల్లో అరవై ఏళ్ల క్రితం పేదరికం గురించి మాట్లాడారు. ఇరవై ఏళ్ల క్రితం కూడా పేదరికం గురించే మాట్లాడారు. ఇప్పుడూ దాని గురించే మాట్లాడుతున్నారు. అంటే ఈ దేశంలో పేదరికం అనేది వారికి ఒక ప్రచారాస్త్రం మాత్రమే. మాటల్లో తప్ప చేతల్లో పేదరికాన్ని అంతమొందించడంలో విఫలమయ్యారన్నది వాస్తవం.

దేశంలో ఒకనాడు కాంగ్రెస్‌కు ఎదురుండేది కాదు. కాని ఈరోజు కాంగ్రెస్ పరిస్థితి ఓ పెద్ద ప్రాంతీయపార్టీ స్థాయికి పడిపోతుంది. ఈమధ్య జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను చూస్తే ఇక దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ బ్రతికి బట్టకడుతుందా అనే అనుమానాలు లేకపోలేదు. నిజమే ఆ ఫలితాల ప్రభావాన్ని చూస్తే కాంగ్రెస్‌పార్టీని ప్రజలు ఎంతగా అసహ్యించుకుంటున్నారో అర్థమవుతుంది. ఒకప్పుడు ఏం చేసినా కాంగ్రెస్‌పార్టీయే దిక్కు అనే దీనావస్థ వుండేది. ఈరోజు దేశంలో కాంగ్రెస్‌కు బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థలు ఏర్పడుతున్నాయి. ఈ దేశాన్ని నెహ్రూ కుటుంబీకులే పరిపాలించాలనే భ్రమల నుండి ప్రజలు బయటపడుతున్నారు. కాంగ్రెస్ కేవలం కులం, మతం, ప్రజలను విభజించి పరిపాలించే విధానంపైనే పనిచేస్తూ వచ్చింది. తాత్కాలిక పథకాలు, ఓటుబ్యాంకు రాజకీయలపైనే ఆధారపడుతూ వచ్చింది. సుదీర్ఘ ప్రణాళికతో నిర్దిష్ట అభివృద్ధి కార్యక్రమాలకు ఆ పార్టీ ఏనాడూ రూపకల్పన చేయలేదు. కాబట్టే స్వాతంత్ర్యం వచ్చాక ఆరున్నర దశాబ్దాల తర్వాత కూడా ఆహార భద్రత వంటి నిస్సారమైన పథకాలను తెచ్చిపెట్టింది. ఈ దేశంలో అభివృద్ధి కంటే అవినీతి, కుంభకోణాలే ఎక్కువగా జరిగాయి. ప్రజలు వీటిపై విసిగిపోయారు. కాంగ్రెస్ రహిత రాజకీయాల కోసం ఎదురుచూస్తున్నారు.

సోనియాగాంధీ ఇమేజ్‌తోనో రాహుల్‌గాంధీ గ్లామర్‌తోనో కాంగ్రెస్‌పార్టీ బ్రతికి బట్టకట్టే పరిస్థితి లేదు. పార్టీలు, ప్రభుత్వాల పనితీరు ఆధారంగానే ప్రజలు మార్కులేస్తున్నారు. ముఖ్యంగా ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయపార్టీలు ప్రబలశక్తిగా మారుతున్నాయి. అక్కడ జాతీయపార్టీల మనుగడ కష్టంగా మారుతుంది. ఒకప్పుడు యూపీ, బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు వంటి పెద్ద రాష్ట్రాలన్నీ కాంగ్రెస్ ఏలుబడిలోనివే! ఈరోజు అక్కడ కాంగ్రెస్ మరుగుజ్జయ్యింది. వచ్చే ఎన్నికల తర్వాత మరికొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ మరుగవుతుంది. నిన్నటి ముంబై బహిరంగసభలో నరేంద్ర మోడీ పిలుపునిచ్చినట్లు ఇంకొన్నేళ్ల తర్వాత నిజంగానే కాంగ్రెస్ రహిత భారతదేశాన్ని చూస్తామేమో!

## 'అంతర్'జాతీయం

- గుజరాత్ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మక 'ఇండియాటుడే స్టేట్ ఆఫ్ ది స్టేట్స్' అవార్డు లభించింది. స్థూల ఆర్థిక నిర్వహణలో అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకుగాను 2013 సంవత్సరానికి ఈ అవార్డును ప్రకటించారు.
- ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రూపొందించిన తేలికపాటి యుద్ధవిమానం 'ఎల్‌సిఏ తేజస్'కు భారత వైమానిక దళంలో ప్రవేశించేందుకు ప్రాథమిక అనుమతి లభించింది. కాలం చెల్లిన మిగ్-21 విమానాల స్థానంలో వీటిని ప్రవేశపెడుతారు. తేజస్ రూప కల్పనతో సొంతంగా యుద్ధవిమానాలు తయారుచేయగల దేశాల జాబితాలోకి భారత్ చేరింది.
- జమ్మూకాశ్మీర్ విద్యుతుత్పత్తి కోసం కిషన్ గంగ నీటిని వాడుకోవచ్చని హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు చెప్పింది. కిషన్‌గంగ నది నుంచి భారత్‌కున్న నీటి మళ్లింపు హక్కుపై పాకిస్థాన్ అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అయితే ఈ అభ్యంతరాలను అంతర్జాతీయ న్యాయస్థానం తోసిపుచ్చింది.
- ప్రముఖ న్యాయవాది, భారత సంతతి మహిళ నందితా బెర్రీ టెక్సాస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా నియమితులయ్యారు. జనవరి 7న ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.
- అమెరికాలో వీసా అవకతవకల కేసును ఎదుర్కొంటున్న భారత రాయబారి దేవయానికి కాస్త ఊరట లభించింది. పనిమనిషిని వేధించిన కేసులో దేవయానిని అమెరికా పోలీసులు అరెస్ట్ చేసి అవమానించడం అమెరికా - భారత్‌ల మధ్య దౌత్య వివాదానికి దారి తీసింది. ఈ ఘటనపై భారత్ అంతటా నిరసనలు వ్యక్తమయ్యాయి. కాగా ఈ కేసులో దేవయాని వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాకుండా అమెరికా న్యాయస్థానం మినహాయింపునిచ్చింది.
- ఏకె 47 తుపాకీ రూపకర్త కలష్నికోవ్(94) డిసెంబర్ 23వ తేదీ మరణించారు. 1947లో ఆయన ఈ తుపాకీని రూపొందించారు. అప్‌టోమాట్ కలష్నీ అనే తన పేరులోని ఏకెతో, తుపాకీ తయారు చేసిన 1947లోని 47ను కలిపి ఏకె47 అని పేరు పెట్టారు.
- కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి వినోద్‌కుమార్ దుగ్గల్‌ను మణిపూర్ గవర్నర్‌గా నియమించారు. ఆయన ప్రస్తుతం జాతీయ విపత్తుల నిర్వహణ మండలిలో సభ్యులుగా ఉన్నారు.
- భారత సంతతికి చెందిన రిపబ్లికన్ పార్టీ ముఖ్యనేత, ప్రస్తుత లూసియానా గవర్నర్ బాబీజిందాల్ 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి సన్నాహమవుతున్నారు. గవర్నర్‌గా ఆయన పదవీకాలం 2015తో ముగుస్తుంది.
- ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఎన్నికల నిర్వహణపై యెమెన్‌కు శిక్షణనివ్వనుంది. ఓటర్ల జాబితా తయారీ, ఓటింగ్, ఈవిఎంలు, ఫలితాల వెల్లడి వంటి అంశాల్లో తన అనుభవాన్ని యెమెన్‌కు పంచనుంది. ఈమేరకు ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- విభజన ప్రక్రియను ఆపండి.
- రాష్ట్రపతిని కోరిన సీమాంధ్ర మంత్రులు.

వ్యాఖ్య :- *ఆయన కూడా కాంగ్రెస్ తానులో ముక్కే కదా!*

వార్త :- కలిసి పోరాడదాం. - ఏపీ ఎన్జీఓ హోంలో అఖిలపక్ష భేటీ.

వ్యాఖ్య :- *రాష్ట్రం విడిపోయాకనా?*

వార్త :- న్యాయం ప్రతి గడపను తాకాలి.
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కల్యాణ్‌సేన్ గుప్తా.

వ్యాఖ్య :- *ప్రస్తుతానికి అన్యాయం మాత్రం అన్ని గడపలు తొక్కుతుంది.*

వార్త :- సీబీఐ తరహాలో దర్యాప్తు చేస్తాం. - ఏసిబి డీజి ఏ.కె.ఖాన్.

వ్యాఖ్య :- *అంటే ఏ కేసునూ తేల్చరా?*

వార్త :- కేంద్రం విజ్ఞత లేకుండా బిల్లు తెచ్చింది.
- గాలి ముద్దుకృష్ణమనాయుడు.

వ్యాఖ్య :- *రాజకీయపార్టీలకు విజ్ఞత కూడా వుంటుందా?*

వార్త :- కాంగ్రెస్‌కు నాయకత్వ లేమి. - నోబెల్ గ్రహీత అమర్త్యసేన్.

వ్యాఖ్య :- *దానికంటే కూడా భజన పెద్ద సమస్య అయ్యింది.*

వార్త :- స్వలింగసంపర్కులపై పునరాలోచించండి.
- సుప్రీంను కోరిన కేంద్రం.

వ్యాఖ్య :- *వీరిమీద పెడుతున్న శ్రద్ధ దేశం మీద కూడా లేదే!*

వార్త :- 'పద్మశ్రీ'లు తిరిగచ్చేయండి.
- మోహన్‌బాబు, బ్రహ్మానందంలకు హైకోర్టు ఆదేశం.

వ్యాఖ్య :- *'పద్మశ్రీ'ని చేతి రుమాళ్లుగా వాడుకున్నందుకు తగిన శాస్తే జరిగింది.*

వార్త :- రాష్ట్ర విభజన జరగదు. - మంత్రి కాసు కృష్ణారెడ్డి.

వ్యాఖ్య :- *కాంగ్రెస్ పని మీద అంత నమ్మకమా?*

వార్త :- ఛార్జీలు పెంచే యోచన లేదు. - రైల్వేమంత్రి ఖర్గే.

వ్యాఖ్య :- *లేదంటే వున్నట్లే... రాజకీయనేతల మాటలకు అర్థాలు రివర్స్‌లే!*

వార్త :- నన్ను ప్రధానిని చేయండి. - పార్టీ శ్రేణులకు ములాయం పిలుపు.

వ్యాఖ్య :- *గాడిదమీద కూర్చుని ప్రపంచ జైత్రయాత్ర చేయాలనుకున్నట్లుగా ఉంది.*

వార్త :- తెలంగాణ రావడం కేసీఆర్‌కు ఇష్టం లేదు. - రేవంత్‌రెడ్డి.

వ్యాఖ్య :- *చాలా ఆలస్యంగా నిజం తెలుసుకున్నారు.*

వార్త :- పార్టీలో ఉండాలనుకుంటున్నా... బొత్స వద్దంటున్నారు. - జేసీ.

వ్యాఖ్య :- *ఆయన వద్దనేది కూడా మీ మంచికోసమేగా!*

# చెరుకు రైతుల బకాయిలు చెల్లించండి



అఖిలపక్ష కమిటీ నాయకులతో ఆనం

నెల్లూరుజిల్లా కోవూరు సహకార చక్కెర కర్మాగారం రైతుల బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష కమిటీ నాయకులు రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆదివారం సంతపేటలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. టీడీపి, సిపిఐ, సిపిఎం, బిజేపి, రైతు సమాఖ్య తదితర నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం రైతులకు దాదాపు 7కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఉద్యోగులు కార్మికులకు 6కోట్లు వేతనాలు పెండింగ్‌లోఉన్నాయన్నారు. 2013-14సీజన్‌కు సంబంధించి చెరుకును ఆడించేందుకు అవసరమైన 3కోట్లు నిధులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి పముజుల దశరథరామయ్య, తెలుగు రైతుజిల్లా అధ్యక్షుడు సుందరరామిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, సిపిఐ నాయకులు రామరాజు, బీజేపీ నాయకుడు జెట్టి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

# ఆయుధాలు సరఫరాకు గ్రీన్‌సిగ్నల్

అటవీ అధికారులపై దాడులుచేసి హతమారుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అటవీ సిబ్బందికి తక్షణం ఆయుధాలు సరఫరాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతోపాటు అటవీ సిబ్బందికి ఫైరింగ్‌లో శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. త్వరలోనే ఫైరింగ్‌పై హైదరాబాద్‌లో శిక్షణ ప్రారంభించనున్నారు. ఫారెస్ట్ ఏరియాల్లో పూర్తిస్థాయి కూంబింగ్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం అటవీ సిబ్బందితో పాటు సివిల్, ఏపీఎస్పీ విభాగాల నుంచి పోలీసులను కేటాయించనున్నారు. ఒక్కో డివిజన్‌కు 30మంది పోలీసులు, అటవీ సిబ్బందితో కూడిన టీమ్ కూంబింగ్ నిర్వహించనుంది. అటవీ శాఖను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

## హైలెవల్ కెనాల్‌కు 1532.19కోట్లు

ఆనం సంజీవరెడ్డి సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ నిర్మాణానికి 1532.19కోట్లు మంజూరుచేసినట్లు రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పడమటి నాయుడుపల్లి, పొంగూరు, ఇనకపల్లి, పెగళ్లపాడు వద్ద నాలుగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించడంతో పాటు 5పంపింగ్ సెంటర్‌లు ఏర్పాటుచేసి 43 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని వివరించారు. జాఫర్‌సాహెబ్ కాలువ ఆధునీకరణకు 105.21కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

## చిల్డ్రన్స్‌పార్కులో...
## మ్యూజికల్‌నైట్ వద్దు

నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్కులో జనవరి 1వతేదీన టీవీ, సినీ ఆర్టిస్టులతో నిర్వహించనున్న మ్యూజికల్ నైట్‌ను ఏర్పాటుచెయవద్దంటూ చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం చిల్డ్రన్‌పార్కులో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. మ్యూజికల్‌నైట్ ఏర్పాటుచేస్తే పార్కు పాడైపోయే ప్రమాదముందన్నారు. వేలాదిమంది పార్కులో తిరగడం వల్ల మొక్కలు చనిపోతాయన్నారు. ఈ మధ్యనే 5లక్షలు వెచ్చించి మొక్కలు నాటి, ఆట వస్తువులను ఏర్పాటుచేశారని తెలిపారు.

మ్యూజికల్‌నైట్‌ను మరో ప్రాంతానికి మార్చాలని డిమాండ్‌చేసారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి పాముల రమణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

# అంతర్‌జిల్లా దొంగలు అరెస్ట్


అంతర్‌జిల్లాలకు చెందిన ముగ్గురు దొంగల్ని అరెస్టుచేసి వారి వద్ద నుంచి 7 మోటార్‌సైకిళ్లు, 10సవర్ల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరుజిల్లా కావలి డిఎస్పీ బాలవెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం డిఎస్పీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.

ప్రకాశంజిల్లా కొనకలమిట్ల మండలం, తువ్వపాడుకు చెందిన బొడ్డపాటి శ్రీనివాసులు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పలుచోట్ల మోటారు సైకిళ్ళను చోరీచేసాడని వివరించారు. శ్రీనివాసులు ఒంగోలు నుంచి నెల్లూరు వైపుకు మోటారు సైకిళ్ళపై వెళుతున్నాడని, ట్రైనీ ఎస్సై అతన్ని ఆపినా ఆపకుండా వెళ్లడంతో వెంబడించి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతను తెలిపిన సమాచారం మేరకు రూ. 3లక్షలు విలువగల 7మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. కర్నూలుజిల్లా సిద్దాపురానికి చెందిన తమ్మిశెట్టి సుబ్బారాయుడు, నెల్లూరుజిల్లా బోగోలు మండలం కప్పరాళ్ళతిప్పకు చెందిన గొడ్డేటి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వారు చేసిన చోరీలు వెలుగులోకి వచ్చాయన్నారు. వారి వద్ద నుంచి 10సవర్ల బంగారు నగలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషిచేసిన సిఐ ప్రసాద్, ఎస్సై గిరిబాబు, ట్రైనీ ఎస్సై రామకృష్ణ, ఒకటవ పట్టణ ఎస్సై అంజిబాబు, సిబ్బంది హరి, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, మాధవ, అయోధ్య, ప్రేమయ్య, రాజేష్, హేమచంద్రబాబును డిఎస్పీ అభినందించారు.

## కాలధర్మం
# నల్లారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



'లాయర్' పాఠకుడు, నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకులో 30ఏళ్లపాటు వివిధ హోదాలలో సేవలందించి మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేసిన మృదు స్వభావి నల్లారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి డిసెంబర్ 23వ తేదీ రాత్రి చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో కనుమూసారు. ఆయన వయసు 64 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొడవలూరు మండలం బసవాయపాలెం ఆయన స్వగ్రామం. గత ఐదేళ్లుగా ఆయన అడ్వకేటుగా ప్రాక్టీసు చేస్తూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు న్యాయసలహాదారుగా సేవలందిస్తున్నారు. నెల్లూరులోని మెక్లిన్స్‌క్లబ్‌లో ఆయన సభ్యులుగా వున్నారు. ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# నెల్లూరు కబుర్లు

## వివేకా @64



అరవైలోనూ ఇరవైలా కనిపించే స్టైల్ ఆఫ్ సింహపురి బిరుదాంకితుడు, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మొన్న 23వ తేదీతో 64వ సంవత్సరంలోకి అడుగుపెట్టాడు. ఏ బర్త్‌డేకు కూడా వివేకా నెల్లూరులో అందుబాటులో ఉండడు. ఆరోజు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తాడు. మొన్న బర్త్‌డే రోజు కూడా అదే చేసాడు. ఫోన్‌లో శుభాకాంక్షలు చెప్పే అవకాశం కూడా అభిమానులకు లేకుండా పోయింది. వివేకాకు 64ఏళ్లు వచ్చాయంటే కొత్తగా చూసేవాళ్లు ఎవరూ నమ్మరు. ఆ విధంగా మేకప్ వేసుకోవడంలో సినిమాయాక్టర్లు కూడా ఆయన ముందు దిగదుడుపే. రంగురంగుల గుడ్డలు, రకరకాల కళ్లద్దాలు పెడుతూ ఎప్పుడూ నిత్యనూతనంగా జీవించడం వివేకా స్టైల్. ఏడాదికేడాది ఆయన వయసు పెరుగుతుందే కాని మనసు మాత్రం అలా కుర్రకారు వద్దే ఆగిపోయింది.

## రాజేశ్వరమ్మ రాబడి

నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ హుండీని 24వ తేదీ లెక్కించారు. అక్టోబర్ 5వ తేదీ నుండి డిసెంబర్ 24వ తేదీ వరకు హుండీ ద్వారా 9,50,180 రూపాయల ఆదాయం లభించింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు రత్నం జయరాం, దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఇఓ పాయసం నాగేశ్వరరావు, ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణ, ఇన్స్‌పెక్టర్ శైలేంద్ర తదితరులు పాల్గొన్నారు.



డిసెంబర్ 24వ తేదీన కావలి పట్టణంలో నిర్వహించిన 'జనదీవెనయాత్ర'లో పాల్గొని మైనార్టీలతో ముచ్చటిస్తున్న నెల్లూరు ఎంపీ, వైకాపా రాష్ట్రనాయకులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, పక్కన కావలి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

## నకిలీ ప్రెస్‌కి చెక్




జిల్లాలోని అక్రిడేట్ జర్నలిస్టులకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రెస్ స్టిక్కర్లు ఇవ్వ దానికి జిల్లా ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణ నిర్ణయించారు. జిల్లాలో చాలామంది ప్రెస్, పోలీస్ స్టిక్కర్లను అంటించుకుని వాహనాలు నడుపుతున్నారు. అయితే వీరిలో ఒరిజినల్ ప్రెస్, పోలీసువాళ్ల కంటే డూప్లికేట్స్ ఎక్కువ. జర్నలిస్టుల బంధువులు, స్నేహితులు కూడా తమ వాహనాలకు 'ప్రెస్' అని వ్రాసుకుని తిరుగుతున్నారు. ఇలాంటి నకిలీ ప్రెస్‌వాళ్లు పోలీస్‌శాఖకు పెద్ద తలనొప్పిగా మారారు. వీరిని అరికట్టేందుకే అక్రిడేషన్ లిస్టు ప్రకారం జర్నలిస్టులకు ప్రెస్ స్టిక్కర్లు అందజేస్తారు.

విలేకరులు తమ అక్రిడేషన్ నెంబర్, వాహనం, ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్‌ల జెరాక్స్‌లను అందజేసి పోలీసుశాఖ నుండి ఈ స్టిక్కర్‌ను పొందవచ్చు. జనవరి 1వ తేదీ నుండి విలేకరులకు ఈ స్టిక్కర్లు అందజేయనున్నట్లు తెలుస్తుంది.

## డిసిఆర్‌బి కార్యాలయంకు సొకులు

జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన హంగులతో ఆధునీకరించిన డిసిఆర్‌బి కార్యాలయాన్ని సోమవారం జిల్లా ఎస్పీ పివిఎస్ రామకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఐఆర్‌ఎస్ మూర్తి, సిఐలు జయరామసుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ గడువు జనవరి31

రేషన్‌కార్డుదారులు ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు పౌరసరఫరాలశాఖ జనవరి 31 చివరి గడుపు ఇచ్చింది. అప్పటిలోగా అధార్‌తో అనుసంధానం చేయనికార్డులకు ఫిబ్రవరి నుంచి కేటాయింపులు ఉండవని డిఎస్ఓ తెలిపారు. నెల్లూరు జిల్లాలో తెల్లరేషన్‌కార్డులు అన్నపూర్ణ, అంత్యోదయ, రచ్చబండకార్డులు కలిపి 7,81,823 కార్డుదారులున్నారు. ప్రస్తుతం రచ్చబండ-3 క్రింద 1.13లక్షల రేషన్‌కూపన్లు మంజూరుకాగా వీటిలో 71,581మంది ఫోటోతో అనుసంధానం చేసుకున్నారు. మొత్తం 8,53,404కార్డులు ఆధార్‌తో అనుసంధానం జరగాల్సివుంది. కార్డుదారుల్లో మొత్తం కుటుంబాల సభ్యులు 24,45,976మంది ఉంటేవీటిలో 10,79,136 మంది అనుసంధానం జరిగింది.

## చెక్కు పంపిణీ చేసిన ఎస్పీ

నెల్లూరు జిల్లా వరికుంటపాడు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన సాయిబాబా అనారోగ్యంతో ఈ ఏడాది మృతిచెందాడు. సాయిబాబాకు సంబంధించి భద్రతా నిధి కింద మంజూరైన లక్షరూపాయల చెక్కును కానిస్టేబుల్ సాయిబాబా కుమార్తె నాగలక్ష్మికి జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ అందజేశారు. సోమవారం నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఏఆర్‌ఏఎస్పీ ఐఆర్‌ఎస్ మూర్తి, డిఎస్పీలు పి.వెంకటనాథ్‌రెడ్డి, వీఎస్ రాంబాబు, పోలీస్ అధికారుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన రోటరీక్లబ్



మొక్కలు నాటుతున్న రోటరీ సభ్యులు

నెల్లూరులో మద్రాసు బస్టాండు దగ్గరున్న సుంకు చెంగనశెట్టి మున్సిపల్ హైస్కూలులో ఈ నెల 21న రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కొబ్బరి మొక్కలను రొటేరియన్ హుస్సేన్ సౌజన్యంతో పాఠశాల ప్రాంగణంలో రోటరీక్లబ్ ప్రెసిడెంట్ శేఖర్, కార్యదర్శి రొటేరియన్ కె.ప్రతాప్‌రెడ్డి, రోటరీ మాజీగవర్నర్ భరత్‌కుమార్‌రెడ్డి, ఏ.జి.రాఘవేంద్రషెట్టి తదితరులు నాటారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ శేఖర్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేసేందుకు వివిధ పాఠశాలల్లో ఈ విధంగా మొక్కలు నాటుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన పోలీస్

ప్రతి వ్యవస్థలోనూ మంచి చెడు రెండూ వుంటాయి. కాని నేటి పోలీసువ్యవస్థలో చాలామంది మంచికంటే చెడునే ఎక్కువుగా చూస్తున్నారు. అయితే ఆ పోలీసులోనూ మానవత్వం ఉంటుందని, సాటిమనిషి ఆపదలో ఉన్నప్పుడు ఆదుకునే గుణం ఉంటుందని చాటాడో పోలీస్. 23వ తేదీన నెల్లూరులోని నర్తకిసెంటర్‌లో ఓ ఇన్నోవా డ్రైవర్ రవిసింగ్‌కు హఠాత్తుగా ఫిట్స్ వచ్చి బి.పి. పెరిగింది. డ్రైవింగ్ సీట్లోనే అతను కుప్పకూలాడు. అది గమనించిన అక్కడే డ్యూటీలో వున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కేశవులునాయుడు వెంటనే 108కు సమాచారం అందించారు. 108 ద్వారా సకాలంలో రవిసింగ్‌ను ఆసుపత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడారు. ప్రతి మనిషిలోనూ ఇలాంటి స్పందించే గుణం ఉంటే సమస్యలనేవి వాటంతటవే పరిష్కారమవుతుంటాయి.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

9
...నవరంధ్రాలు, నవగ్రహాలు, నవనాదులు, నవదుర్గామూర్తులు, నవధాన్యాలు, నవవిధులు, నవమాసాలు, నవరాత్రులు, నవరసాలు, నవకుబేర నిధులు, నక్షత్రాలు 27 గ్రహ యోగాలు 27 రవి యోగ వైధృతి 27 రాశిచక్రం $360^\circ$ అష్టాదశ 18 పురాణాలు 18 పర్వాలు, కురుక్షేత్ర అక్షౌహిణీలు 18, అక్షౌహిణి అనగా 21870 (టోటల్ 9) రధాలు 65610 గుర్రాలు, ఏనుగులు 21870, కాల్బలం 109350. వీటిని విడిగా లేదా మొత్తాన్ని కలిపినా తొమ్మిదే! అరుదుగా వచ్చే ఈన్యూఇయర్ తేది:1.1.2014 (టోటల్ 9). ఈతేది మీచిరుకులు, చెడులు, చేదలు, చిప్పలు, చింతలు, చిర్రులు, చిద్రాలు, చీకట్లు, చిరుకులు, చిరాకులకు సమాధి.నా దీవెనకు సైంధవులు, అడ్డుగా కుండగాక, అస్తు, తధాస్తు ఇట్లు, సదా మీ శ్రేయోభిలాషి
డా॥ పెళ్ళకూరు జె.పి.రెడ్డి,
M.B.B.S., FSL, FIC.(USA) చర్మ&శిశువ్యాధినిపుణులు
మాగుంటలేఅవుట్ : నెల్లూరు - 2333666

## కోటకు అధ్యక్ష పీఠ

### హార్డ్‌వేర్ అండ్ పెయింట్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నెల్లూరు రంగనాయకులపేటలో ది ఐరన్ హార్డ్‌వేర్ అండ్ పెయింట్స్ మర్చెంట్స్ అసోసియేషన్ భవనంలో ఈనెల 22న జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశంలో జరిగిన ఎన్నికలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోటగురుబ్రహ్మం, ఉపాధ్యక్షులుగా నగరకంటి రవీంద్రకుమార్, కార్యదర్శి పెండెల సుబ్రహ్మణ్యం, ఉపకార్యదర్శి పుట్టా గోపీకృష్ణ, కోశాధికారిగా పి.జనార్ధన్, గౌరవ సలహాదారుగా ఎమ్.సత్యనారాయణగుప్త, కార్యవర్గసభ్యులుగా ఆర్.శరత్‌చంద్ర, పి.రాజశేఖర్, సి.హెచ్.వెంకటేశ్వర్లు, బి.సుబ్బారావు, ఆర్.బంగారయ్య, ఎమ్.నాగేశ్వరరావు, ఎమ్.మల్లికార్జునరావులు ఎన్నికయ్యారు.

వీరు 2సంవత్సరాలు పాటు ఈ బాధ్యతలను నిర్వర్తిస్తారని అధ్యక్షులు కోటగురుబ్రహ్మం ఒక ప్రకటనలో తెలిపారు.

## సెంట్రల్ లైటింగ్‌కు కరెంట్ కట్

విద్యుత్‌శాఖకు నెల్లూరు నగరపాలక సంస్థ కోట్లరూపాయలు బకాయిలు చెల్లించక పోవడంతో ఆదివారం రాత్రి కరెంట్ కట్ చేసారు. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు అంధకారమయ్యాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. నెల్లూరు నగరంలోని మినీబైపాస్‌రోడ్డు, జిఎన్‌టిరోడ్డు, స్టోన్‌హౌస్‌పేట ప్రాంతాల్లోని సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగలేదు. ఇతర ప్రాంతాల్లో పొదలకూరురోడ్డు, హరనాథపురం, భక్తవత్సలనగర్, మాగుంట లే అవుట్ తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. చీకట్లో ఎవరైనా ఎలాంటి సంఘటనలకు పాల్పడుతారోనని భయంతో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. నగరపాలక సంస్థ దాదాపు 19 కోట్లు విద్యుత్ బకాయిలు ఉండగా ఇటీవల కోటిరూపాయలు చెల్లించారు. విద్యుత్‌శాఖ ముందస్తు హెచ్చరికగా కరెంట్ కట్ చేసారు.

## పిల్లలు కాదు పిడుగులు

### --- జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక ---

జాతీయస్థాయి యోగాపోటీలకు నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని కెవిఆర్ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఆదివారం విద్యార్థులకు అభినందనసభ జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌ప్రకాష్‌రావు మాట్లాడుతూ ఈనెల 5,6,7తేదీల్లో నిజమాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన 59వ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య అంతర్ జిల్లాల యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించారన్నారు. జాతీయ స్థాయిలో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జనవరి 15 నుంచి 20వతేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 4బంగారు, 4రజిత, 2కాంస్యపతకాలు సాధించి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేరీవరం, అజయ్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగాపోటీల్లో సత్తాచాటిన నేతాజీ విద్యార్థిని



నెల్లూరులోని శ్రీనేతాజీ పైలట్ హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న వై.సాయి లిఖిత రాష్ట్రస్థాయిలో జరిగిన యోగా పోటీలలో ప్రథమ బహుమతి సాధించింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూరు మండలంలో 17సంవత్సరాలలోపు వారికి జరిగిన యోగాపోటీల్లో 20జిల్లాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల20న స్కూలు కరస్పాండెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. సాయి లిఖిత తల్లిదండ్రులు, యోగా గురువు లక్ష్మీ నరసింహశాస్త్రిలకు శుభాకాంక్షలు తెలిపారు.

PDF Compressor Free Version



# మొదటి పంటకు పూర్తిస్థాయిలో సాగునీరు

**- రాష్ట్ర మంత్రి ఆనం**



సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు జిల్లాలో రైతులు వేసుకున్న మొదటి పంటకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 21న నెల్లూరులోని పినాకిని అతిథిగృహంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ సమన్వయంతో ఇరిగేషన్ అధికారులతో సాగునీటి పరిస్థితులపై సమీక్షించి పలు సూచనలు సలహాలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధానంగా జిల్లాలో ఆశించినంత వర్షాలు పడనందున, నార్త్ఈస్ట్ రుతుపవనాలలో కూడా వర్షాలు పడలేదని దాదాపు మైనస్ 34శాతం నమోదయిందని దీంతో జిల్లాలో రైతులు వేసుకున్న మొదటిపంటకు సాగునీరు అందించేందుకు ఏర్పడుతున్న సమస్యలను ఎదుర్కొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి కొరత ఏర్పడి నందున శ్రీశైలం నుండి సోమశిలకు

## సింహపురి సమాచారం

దాదాపు 13టిఎంసిల అదనపు నీటిని విడుదల చేసేందుకు తగిన ప్రతిపాదనలను ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో ప్రభుత్వానికి పంపాలన్నారు. ఈ ప్రతిపాదనలను ఇరిగేషన్ మంత్రితో సంప్రదించి, ముఖ్యమంత్రితో మాట్లాడి ఆమోదం పొందడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాలో నిర్ధేశిత వర్షపాతం లేనందున జిల్లాను కరువుప్రాంతంగా ప్రకటించేందుకు తగిన ప్రతిపాదనలను పంపాలన్నారు. సోమశిల నుండి దాదాపు 3,500 క్యూసెక్కులు విడుదలచేయగా అందులో కావలి కాలువకు 507క్యూసెక్కులు, కనుపూరు కెనాల్‌కు 300క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 350క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 350క్యూసెక్కులు నీటిని విడుదలచేయడం జరుగుతుందన్నారు. కండలేరు నుండి ఎస్.ఎస్ కెనాల్‌కు 1500 క్యూసెక్కులు నీటిని విడుదల చేయగా అందులో నెల్లూరు జిల్లాకు 600క్యూసెక్కులు, శ్రీకాళహస్తి సర్కిల్ పరిధిలో చిత్తూరుజిల్లా, వెంకటగిరి నియోజకవర్గ రైతాంగంకు 850 క్యూసెక్కులు నీటిని విడుదలచేయడం జరుగుతుందన్నారు. సోమశిల వద్ద ఆత్మ కూరు నియోజకవర్గ పరిధిలోని మెట్ట ప్రాంత మండలాలకు దాదాపు 2.50లక్షల మందికి త్రాగునీరు 90వేల ఎకరాల ఆయ కట్టుకు సాగునీరు పూర్తిస్థాయిలో అందిం చేందుకు నిర్మిస్తున్న హైలెవల్ కెనాల్ ప్రాజెక్టుకు 1560కోట్లు ఖర్చు అవుతుందని అంచనావేయడం జరిగిందన్నారు.

# జిల్లాకు ఐటి యోగం?

నెల్లూరుజిల్లాలో సమాచార, సాంకేతిక సంస్థల సముదాయం (ఐటీపార్కు) ఏర్పాటుకానుంది. ఇందుకోసం ప్రత్యేకంగా భూసేకరణ జరిపేందుకు సన్నాహాలు చేపట్టారు. వివిధ ఐటీ సంస్థల ఆధ్వర్యంలో ఇక్కడ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. చెన్నై-బెంగుళూరు పారిశ్రామిక కారిడార్‌లో నెల్లూరుజిల్లాను కూడా చేర్చారు. ఇప్పటికే జిల్లాలో ఐదు పారిశ్రామిక ప్రత్యేక ఆర్థికమండళ్ళు (సెజ్) పలు పారిశ్రామికవాడలు ఏర్పాటయ్యాయి. ఎనిమిది థర్మల్ విద్యుత్ కేంద్రాలతో పాటు ఆయిల్ పరిశ్రమలు, కృష్ణపట్నం ఓడరేవు ఏర్పాటుతో జిల్లాలో పారిశ్రామిక అవసరాలు పెరిగాయి. పలు ఇంజినీరింగ్ కళాశాలలు వున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని ఐటీ సంస్థలు జిల్లాకు రానున్నట్లు సమాచారం. ప్రతి జిల్లాలో ఒక ఐటీ పార్కు ఏర్పాటు చేయాలనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# తెలుగు తమ్ముళ్ళు... నాటకాల రాయుళ్ళు

**- వైఎస్సార్సీపీ నేత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**




నెల్లూరు వేదాయపాళెంలో ఈ నెల 22న వైఎస్సార్సీపీ నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్యాంధ్ర కోసం సుప్రీం కోర్టుకు, రాష్ట్రపతి స్పీకర్‌కు అందించే అఫిడ విట్లుపై తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబునాయుడు చేత ఆ పార్టీ నేతలు సంతకం చేయించగలరా? అని ప్రశ్నించారు. అఫిడవిట్ల ఆలోచన తమదే అంటున్న తెలుగుదేశం పార్టీ నేతలు అసెంబ్లీలో ఆడిన నాటకాలు ప్రజలు మరచిపోలేదని, ఓట్లు, సీట్ల కోసం చంద్రబాబు ఆంధ్రరాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని అదే తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి సుస్పష్టంగా సమైక్యాంధ్రను కోరుతూ రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం అందించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు నరసింహయ్య ముదిరాజ్, పురుషోత్తంయాదవ్, ఛీమినేని మురహరి, రాజగోపాల్‌రెడ్డి, సిబ్బిన కిరణ్, గుంజి శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, నారాయణరెడ్డి, రమణరెడ్డి, మల్లారెడ్డి అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా రెయిన్‌బో క్రీడోత్సవం



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ వెంకటనాథ్

నెల్లూరు నగరం మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో స్కూలు క్రీడోత్సవం గేమ్సుగాలా-2013 ఇటీవల నెల్లూరు ఏసీసుబ్బారెడ్డి స్టేడియంలో కోలాహలంగా జరిగింది. ఈ క్రీడోత్సవాన్ని నెల్లూరు నగర డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణపొంది ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. క్రీడలు ద్వారా దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ అరుణ స్వయంప్రభ పిఈటీలు జావిద్, సుకుమార్, భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.

# చిన్నారులచే తెలంగాణబిల్లుకు రూపకల్పన




అది బాంబుపేలుళ్ల రహిత నగరంగా ఐఎస్ఐ గుర్తింపు పొందిన భాగ్యనగరం. రాష్ట్రపతి విడిది భవనం. అప్పుడే సూర్యోదయం అయ్యింది. సూర్య భగవానుడి లేలేత కిరణాలు వెచ్చగా తాకడంతో రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ లేచాడు. ముఖం కడుక్కుని తలుపుతీసి బయటకు వచ్చాడు. అక్కడ చూస్తే కొందరు రెండు గ్రూపులుగా నేలమీదే పడుకుని నిద్రపోతున్నారు. ప్రణబ్‌ముఖర్జీ తన పి.ఎస్‌ను పిలిచి ఎవరు వీరంతా అని అడిగాడు. పి.ఎస్ వుండి... ఆ పక్కనాళ్ళు తెలంగాణ ఎమ్మెల్యేలు సార్, ఈ పక్క నోళ్లు సీమాంధ్ర ఎమ్మెల్యేలు... మీరు లేవగానే తమ సమస్యలు చెప్పుకోవాలని రాత్రే దుప్పట్లు తెచ్చుకుని ఇక్కడే పడుకుని నిద్రపోయారని చెప్పాడు. వాళ్లందర్నీ లేపి టీ, కాఫీ ఇచ్చి తర్వాత నా వద్దకు పంపండని చెప్పి ప్రణబ్ లోపలకు వెళ్లిపోయాడు. పి.ఎస్ అందర్నీ నిద్రలేపి కాఫీ, టిఫిన్‌లు ఇచ్చాడు. ఈలోపు ప్రణబ్‌ముఖర్జీ రెడీఅయ్యి హాలులో కూర్చుని ఇరు ప్రాంతాల నేతలను ఒకేసారి రమ్మని చెప్పాడు. అందరూ లోపలకు వెళ్లారు. ఓ పక్క కేసీఆర్, కిషన్‌రెడ్డి, నాగం జనార్ధన్‌రెడ్డి, ఈటెల రాజేందర్, హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పొన్నాల ప్రభాకర్, మోత్కుపల్లి నరసింహులు, నాయని నర్సింహారెడ్డి, బండారు దత్తాత్రేయులు కూర్చున్నారు. ఇంకోపక్క శైలజానాథ్, టి.జి.వెంకటేష్, లగడపాటి రాజగోపాల్, రాయపాటి సాంబశివరావు, గంటా శ్రీనివాసరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి వంటి నేతలున్నారు. ప్రణబ్ ముఖర్జీ ముందుగా తెలంగాణ వాళ్ళను... మీ సమస్యలు చెప్పండని అడిగాడు. కేసీఆర్ అందుకుని... ఏం లేద్సార్, తెలంగాణ బిల్లు తయారుచేసి పెట్టారు కదా, మీరు తొందరగా ఆమోదముద్ర వేస్తే మా తెలంగాణను మేం ఏలుకుంటాం, హైదరాబాద్‌లో ఉన్న సీమాంధ్రుల ఆస్తులను మావాళ్ళు తలా ఒకటి పంచేసుకున్నారు. మీరు తెలంగాణ ఇచ్చిందే ఆలస్యం... వాళ్లను దంచేసి తరిమేసి ఆస్తులు లాక్కుంటాం... అసెంబ్లీ తీర్మానం, పార్లమెంటు ఆమోదం తర్వాత సంగతి, ముందు మీరు ఆమోదముద్ర వేసెయ్యండి పనైపోతుందన్నాడు. అందుకు సీమాంధ్రనుండి టి.జి.వెంకటేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ... చూసారాసార్, వాళ్లకు కావాల్సింది తెలంగాణ కాదు, మా ఆస్తులు... ఇలాంటి స్థితిలో తెలంగాణ ఇస్తే హైదరాబాద్‌లో వున్న మా ఆస్తులేంకావాలని వాపోయాడు. అప్పుడు సీపీఐ నారాయణ ఆవేశంగా లేచి... ఎక్కడివోయ్ మీ ఆస్తులు... సీమాంధ్రలో వున్న భూములను తెచ్చి ఇక్కడేమన్నా పెట్టేంద్రా... దుక్కిదున్నింద్రా, నారుపోసింద్రా, నీరు పెట్టింద్రా... ఎందుకివ్వాలి మా భూములు మీకు అంటూ ఆర్.నారాయణమూర్తి లెవల్లో రెచ్చిపోయాడు. అప్పుడు గంటా శ్రీనివాసరావు లేచి అసలు తెలంగాణ బిల్లే తప్పులతడకగా ఉంది సార్... ఇలాంటి బిల్లును ఎలా ఆమోదిస్తారని అడిగాడు. తప్పులా? ఏం తప్పులున్నాయి... ముందు వీటి మీద చర్చించండని ప్రణబ్ ముఖర్జీ ఇరుప్రాంతాల నేతలను కోరాడు. మళ్లీ గంటానే అందుకుని... పోలవరం ప్రాజెక్టును ఆంధ్రాలో నిర్మిస్తారట, దాని నీళ్లను మాత్రం తెలంగాణ వాళ్లు వాడుకోవాలట, విద్యుత్ ప్రాజెక్టులు మా సముద్రతీరప్రాంతంలో పెడతారట... వాటి నుండి వచ్చే విద్యుత్ మాత్రం తెలంగాణకట. ఇరు ప్రాంతాలకు న్యాయం అంటూ ఛార్మినార్, గోల్కొండ, ట్యాంక్‌బండ్, హైటెక్‌సిటీ లాంటివే సీమాంధ్రలో కూడా ఎక్కడో చోట కడతారట. ఇదెక్కడి అన్యాయం సార్ అని ప్రశ్నించాడు. దానికి కేసీఆర్ లేచి... ఇందులో అన్యాయం ఏముందిరా భాయ్... అంతా న్యాయమే వుంది... ఇరిగేషన్ ప్రాజెక్ట్, విద్యుత్ ప్రాజెక్ట్‌లు మీ వద్ద ఉంటే అవి మీ సొంత ప్రాపర్టీయే కదా! మాకిచ్చేది టోడి కరెంట్, నీళ్లే కదా! మీరు ఛార్మినార్, గోల్కొండ, హైటెక్‌సిటీ లాంటివి చూసే కదా హైదరాబాద్‌ను వదలమంటే వదలమంటున్నారు. అలాంటివే మీకు కట్టిస్తామంటున్నారు కదా... శుభ్బంగా వాటిని కట్టుకుని చూసుకుంటూ మీరూ అక్కడే వుండొచ్చుగా అని వ్యంగంగా అన్నాడు. మధ్యలో ప్రణబ్‌ముఖర్జీ కలుగజేసుకుని ఇంకా ఏం తప్పులున్నాయన్నాడు. అప్పుడు శైలజానాథ్ లేచి... సీమాంధ్రకు సముద్రతీరం ఉంది కాబట్టి పోర్టులు ఏర్పాటు చేసారని, ఈ విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగింది కాబట్టి అక్కడకూడా సముద్ర తీరాన్ని ఏర్పాటుచేసి పోర్టులు అభివృద్ధి పరచాలని బిల్లులో ఉంది... ఇదెంత అన్యాయం... ఇదెంత దగా అని అరిచాడు. దానికి నాగం జనార్ధన్‌రెడ్డి కోపంగా లేచి... ఏంటీ దగా ఏంటి మోసం... మాకుండి మీకు లేని గోల్కొండ, ఛార్మినార్‌లు మాత్రం మీకు ఇస్తామంటే మీకు అది అన్యాయం అనిపించలేదు. మీకుండి మాకు లేని సముద్ర తీరాన్ని మాత్రం మాకు తెస్తామంటే మోసం, దగా అంటారా? మీరు ఇలాంటి వాళ్లు కాబట్టే మీ నుండి మేం విడిపోవాలనుకుంటున్నాం... మాకూ పోర్టులు కావాలని ఉండదా? పెద్దపెద్ద స్టీమర్లు వస్తే చూడాలని ఉండదా? మా పిల్లలతో కలిసి బీచ్‌లలో ఆడుకోవాలని ఉండదా? అని ప్రశ్నించాడు. నాగం ఆగం చూసి ప్రణబ్‌ముఖర్జీ బిత్తరపోయాడు. తెలంగాణలో సముద్ర తీరప్రాంతాన్ని ఏర్పాటు చేయాలన్న పాయింట్ చూసేసరికే బిల్లులో ఎన్ని తప్పులున్నాయో ఆయనకు అర్థమైంది. అసలు ఈ బిల్లు తయారు చేసింది ఎవరై ఉంటారని ఆయన ఆలోచిస్తుండగా అక్కడకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వచ్చాడు. ఆయన చేతిలో ఓ సిడి వుంది. అది రాష్ట్రపతికి ఇచ్చి, సార్ ఈ సిడి చూడండి, టీ-బిల్లు ఎవరు తయారుచేసారు, ఎలా తయారు చేసారో తెలుస్తుందన్నాడు. వెంటనే ప్రణబ్ ముఖర్జీ సిడి పెట్టి టీవీ ఆన్ చేసాడు. అది జిఓఎం సభ్యుడు, కేంద్రమంత్రి జైరాంరమేష్ ఇల్లు. ఆయన టిఫిన్ చేస్తుండగా సోనియాగాంధీ నుండి ఫోన్ వచ్చింది. రమేష్ నాకు సాయంత్రంలోగా తెలంగాణ బిల్లును తయారు చేసి పంపించండని ఆదేశించింది. చిన్నప్పుడు ఒకరోజులో చేయాల్సిన హోంవర్క్‌ను కూడా నాలుగైదు రోజులు చేసేవాడిని, ఈ బిల్లును ఒక్కరోజులో ఎలా తయారుచేయాలిరా దేవుడా అని అనుకుంటుండగా ఎదురుగా హోం వర్క్‌తో కుస్తీ పడుతున్న తన మనుమళ్లు ఆపద్బాంధవుల్లా కనిపించారు. జైరాం రమేష్ వారిని పిలిచి... మీ ఇద్దరికీ ఓ మంచి హోంవర్క్ ఇస్తున్నాను... ఆంధ్రప్రదేశ్ అనే రాష్ట్రాన్ని రెండుగా విడదీయాలి. ఈ ప్రాంతంలో వున్నవి ఆ ప్రాంతంలో ఉండేటట్లు, అలాగే ఆ ప్రాంతంలో వున్నవి ఈ ప్రాంతంలో వుండేటట్లుగా సమంగా ఉండేలా బిల్లు తయారు చేయమని చెప్పాడు. వాళ్ల అలాగే బేరీజువేసుకుంటూ ఇరుప్రాంతాలలోనూ గోల్కొండ, ఛార్మినార్, హైటెక్ సిటీ, తిరుమల కొండ, శ్రీశైలం దేవస్థానం... చివరకు సముద్రం, షార్ సెంటర్, పులికాట్ సరస్సు వంటివి కూడా ఇరు ప్రాంతాల్లో ఉండాలని పేర్కొంటూ తెలంగాణ బిల్లును వ్రాసిపెట్టారు. సాయంత్రం ఇంటికొచ్చిన జైరాం రమేష్ వారు తయారుచేసిన బిల్లును చూసి తెగమురిసిపోతూ భవిష్యత్‌లో మా కాంగ్రెస్‌కు మీలాంటి నాయకులే అవసరం అని మెచ్చుకున్నాడు.

ఇక్కడితో సి.డి. అయిపోయింది. అది చూసి ప్రణబ్ ముఖర్జీకి ఆశ్చర్యం కలిగింది. ఆయన వుండి... సీమాంధ్రనేతలతో... చూసారా మన విద్యార్థుల విజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందిందో... ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర విభజన బిల్లులను సైతం ఐదోతరగతి చదివే విద్యార్థులు తయారు చేయగలుగుతున్నారంటే... వాట్ ఏ వండర్... ఇదంతా యూపిఏ సర్కార్ ఘనతే అని మెచ్చుకున్నాడు. ఆయన మాటలతో సీమాంధ్ర నేతలకు తల తిరిగినంత పనయ్యింది.

## కదంబం

### ముగింపుకో ప్రారంభం

అడిగోపుల వెంకటరత్నమ్
తిరుపతి. 9848252946

ముగింపు వుందని తెలుసు
ముగింపు ప్రారంభమని తెలుసు
ఆశ నిరాశల మధ్య
పరిభ్రమించటం
పరిహసించటం
పరాభవించటం
ప్రశంసించటం
పైకెత్తటం
వీటికి అలవాటు!
రహదారులకేం అన్నీ వున్నాయి
వాడుకున్నదెవరు?
దొడ్డిదారులకేం ఇంటింటా వున్నాయి
వాడుకోనిదెవరు?
ముగింపు అనుకున్నది
ప్రారంభమైనప్పుడు
ముగింపుకు పర్యాయపదం
ప్రారంభం
పడమటి సూర్యుడు చంద్రుణ్ణి
నిద్రలేపుతాడు
తూర్పు సూర్యుడికి చంద్రుడు
సుప్రభాతం పాడుతాడు!
నెత్తిపై మూట దిగి
ఎండిన గొంతు తడిచాక
మూట నెత్తికి ఎక్కుతుంది!
కోతలు పూర్తయి
ధాన్యం గరిసెలు నిండాక
ఏరువాక మేలుకొంటుంది!
పడమటి గాలి పరిసమాప్తి
తూర్పుగాలికి ప్రారంభం
తూర్పుగాలి అణగారితే
కొండగాలి ఆరంభం!
ఎత్తిన తెర దిగి
దిగిన తెర ఎత్తటంలోను
విరామ మెరుగని ప్రారంభం!
పోయిన హరిశ్చంద్రుడి రాజ్యం వచ్చి
మరణించిన సత్యవంతుడు బతికి
ముగింపులేదని చాటిన ప్రారంభం!
ఊరబావి ఎంత తోడినా
ఊట ఊరుతూనే వుంది
నిండుతూనే వుంది!

# సాహితీసరస్వతి పుట్టపర్తి నారాయణాచార్యుల శతజయంతి వేడుకలు

నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం సమీపంలోని హోటల్ శివం ఇంటర్నేషనల్ సమావేశ మందిరంలో ఈనెల 24న త్వరకవి వెంకట బాలకృష్ణమూర్తి రచించిన హనుమద్విజయం వచనసుందరకాండ గ్రంథాన్ని ఆకాశవాణి, దూరదర్శన్ విశ్రాంత ఉపసంచాలకులు డాక్టర్ పుట్టపర్తి నాగపద్మిని ఆవిష్కరించారు. ఐహం గ్రంథకర్త పుట్టపర్తి నారాయణాచార్యులు శతజయంతి సందర్భంగా సాహితీమిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన ఆ సాహితీ సభకు పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా సాహితీమిత్రులు ఈతకోట సుబ్బారావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, టీవీ నరసింహం, మైథిలి మనోహర్ రెడ్డి, ఎస్.బలరామయ్యనాయుడు, కృష్ణమూర్తి, మెహబూబ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పుట్టపర్తి నాగపద్మిని మాట్లాడుతూ తనతండ్రి పుట్టపర్తి నారాయణాచార్యులుకు నెల్లూరు మూలాపేటలో స్నేహితులున్నారని, తాను తరచూ చిన్నప్పుడు ఇక్కడకు వచ్చానని తెలిపారు. తనతండ్రి 14భాషల్లో పండితులని, ఆయన రచనలను సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషిచేస్తానని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలే మానవతకు పునాదులు అన్నారు.

### మురళీమోహన్‌రాజుకు...
## సహజసాహితి కళారంగపురస్కారం

చీరాలలోని సహజసాహితి సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఈనెల 22న రోటరీ కమ్యూనిటీహాలులో సాహిత్యసాంస్కృతిక పురస్కారాలను ప్రదానంచేసింది. కార్యక్రమంలో నెల్లూరు నుంచి నాగభైరవ అవార్డుకమిటీ ప్రధాన కార్యదర్శి చిన్ని నారాయణరావు విశిష్ట అతిథిగా పాల్గొనగా తిక్కన రచయితల సంఘం అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజుకు సహజసాహితి కళారంగపురస్కారాన్ని ప్రదానంచేసారు. నెల్లూరుకు చెందిన మరోకవి రాచపాళెం రఘుకు సహజసాహితి నానీల పురస్కారాన్ని అందించారు. ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు బి.హనుమారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనగా ప్రధాన కార్యదర్శి పొన్నూరు శ్రీనివాసులు "తెలుగుసాహిత్యంలో హాస్యం" అంశంపై ఉపన్యసించారు. సభలో సహజసాహితి సేవాసంస్థ అధ్యక్షులు వడలి రాధాకృష్ణ, సాహితీకిరణం సంపాదకులు పొత్తూరు సుబ్బారావు, కవయిత్రి యంబీడి. శ్యామల, కథారచయిత యం.ఆర్.వి.సత్యనారాయణమూర్తి, కవి దాస్యం సేనాధిపతి తదితరులు పాల్గొన్నారు.



Christmas and New Year Greetings

" For unto you is born today in the city of David a Saviour who is Christ the Lord"

SOUTH ANDHRA LUTHERAN CHURCH (SALC)
Central Church Office, East Mission Compound, Tirupati.
Ph: 0877 - 2232455, 2230048

Greets all the people, all the Pastors & all the members of SALC
A Merry Christmas 2013 & Happy and prosperous
NEW YEAR 2014

రైట్. రెవ. ఎన్.డేవిడ్
బిషప్ - ప్రెసిడెంట్
రెవ. కె.యేసు ప్రసాద్
వైస్ ప్రెసిడెంట్
వి.దినకర్ బాబు, సెక్రటరి
బి.అరుణోదయ కుమార్
ట్రెజరర్


వై.ఎ.మోజస్, ఛైర్మన్. బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్
రెవ. S.S.G. శుభాకర్, ఛైర్మన్
బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్
కె.దయాకర్, ఛైర్మన్
బోర్డ్ ఆఫ్ మెడికల్ & మెర్సిఫుల్ వర్క్స్
కె.జె.ప్రేమ్ కుమార్, ఛైర్మన్
బోర్డ్ ఆఫ్ సోషియల్ సర్వీస్

and Members of Executive Committee, Boards & Staff

PDF Compressor Free Version



## మేషం


అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

అనుకున్న పనులకు ఆటంకాలు జరగడం, వస్తువులు ముఖ్య పత్రాలు పోగొట్టుకొనే స్థితి ఉన్నది. ఆర్థిక సమస్యలు, ఉద్యోగ సమస్యల ఆందోళన కలిగిస్తాయి. వృత్తి జీవనం గల వారికి కొంత మేలుగా ఉంటుంది. విద్య, సంతానం ఆరోగ్య విషయాలపై శ్రద్ధ చూపుతారు. ఆత్మీయులు మీ ఇబ్బందులకు అండగా నిలుస్తారు. ఉద్యోగులకు పనిభారం వత్తిడి పెరుగుతుంది.

## వృషభం


కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు


వృత్తి వ్యాపారాలలో కొంత స్తబ్ధత ఉండినా ఆదాయం ఫరవాలేదు. వాణిజ్య విస్తరణకు, కొత్త వ్యాపారాలకు ప్రయత్నాలు ప్రణాళికలు ఏర్పరుస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెరగడం, స్థిరాస్తుల లావాదేవీలు జరపడం చేస్తారు. యజమానులకు వర్కర్లతో సమస్యలుండ గలవు. ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకుంటారు. షేర్లు పెట్టుబడుల మీద లాభాలుంటాయి.

## మిధునం


మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు


స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. ఉద్యోగుల కార్యసామర్థ్యం, ప్రైవేట్ ఉద్యోగులకు పనిభారంతో పాటు గుర్తింపు గౌరవాలుంటాయి. కొత్త ఆలోచనలు పథకాలతో ప్రయత్నాలు జరుపుతారు. వ్యాపారాలలో అర్థంకులు దాటుకొని ఆదాయం పెంచుతారు. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. ఆర్థిక, సామాజిక వ్యవహారాలలో మొగమాటానికి పోయి ఇబ్బందిపడే పరిస్థితి ఉన్నది.

## కర్కాటకం


పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకున్న పనులు సక్రమంగా నిదానంగా జరుగుతాయి. వివాదాస్పద విషయాలకు దూరంగా ఉండండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయముంటు ది. స్థిరాస్తుల లావాదేవీలకు వనరులు సమకూర్చుకొంటారు. ఉద్యోగ ప్రయత్నాలలో దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకొనడం మంచిది. సెన్సెక్స్ లాభాలనందిస్తుంది. సంస్థలు, కమిటీలలో ప్రముఖులుగా వ్యవహరిస్తారు. అనుకోని ఆదాయము కొంత ఉంటుంది.

## సింహం


మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యవహారాలు, సంప్రదింపులలో విజ్ఞత ప్రదర్శిస్తారు. అయితే పనులు నిదానంగా సాగుతాయి. ఉద్యోగులకు ప్రభుత్వ వత్తిడి పెరుగుతుంది. ఆర్థికంగా బాగుంటుంది. ప్రముఖులను కలుసుకొనడం, చర్చలు జరపడం చేస్తారు. ప్రభుత్వ అనుమతులు దొరుకుతాయి. ఉద్యోగ బాధ్యతలలో జాగ్రత్త పడాలి. తొందరపాటు మాటలు, ప్రవర్తన తప్పనిసరిగా అదుపులో పెట్టుకొనండి.

## కన్య


ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకోని ఖర్చులు పైనబడగలవు. వస్తువులు, డబ్బు, ముఖ్య పత్రాలు జాగ్రత్త పరుచుకొనాలి. వృత్తి వ్యాపార రంగాలలో ఆదాయం పెరుగుతుంది. ఘర్షణాత్మకంగా ప్రవర్తించవచ్చును. కోర్టు కేసులందు అనుకూలత, ప్రభుత్వ అనుమతులు, ఋణాలు పొందుతారు. సమావేశాలలో మీ సూచనలు ఆమోదింపబడతాయి. అనుకోని దూర ప్రయాణాలుంటాయి.


బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 27.12.2013 నుండి
తేది. 02.01.2014 వరకు

ఈ వారం మేషంలో కేతువు, మిధునంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువులు, ధనుస్సులో రవి బుధులు, మకరంలో శుక్రుడు, తుల వృశ్చిక ధనుస్సులలో చంద్రుడు సంచరిస్తాడు.

### పంచాంగము:

01.01.2014 బుధవారం ఆంగ్ల సంవత్సరాది.
తేది 02 గురువారం శూన్యమాసారంభము.

### ముహూర్తములు

తేదీ 27 శుక్రవారం ఉదయం గంట 8.00 నుండి గంట 10.00లోగా మకరలగ్నమున వివాహ వ్యాపార ఉపనయన అక్షరాభ్యాసము మొదలగునవి.


### మార్గశీర్ష మాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | శుక్ర | దశమి | రా॥గం.1.54వ॥ |
| తేది. 28 | శని | ఏకాదశి | రా॥గం.12.52వ॥ |
| తేది. 29 | ఆది | ద్వాదశి | రా॥గం.11.28వ॥ |
| తేది. 30 | సోమ | త్రయోదశి | రా॥గం.9.43వ॥ |
| తేది. 31 | మంగళ | చతుర్దశి | రా॥గం.7.40వ॥ |
| తేది. 01 | బుధ | అమావాస్య | సా॥గం.5.30వ॥ |

### పుష్య మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 02 | గురు | పాడ్యమి | సా॥గం.3.10వ॥ |

## తుల


చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

పనుల వత్తిడి వలన ఆందోళన ఉంటుంది. శుభ కార్య ప్రయత్నాలు, ఉద్యోగ ప్రయత్నాలు ఫలించే అవకాశం ఉంది. చేయదలచిన పనులు, వ్యవహారాలలో సముచిత నిర్ణయాలు తీసుకొంటారు. వృత్తి వ్యాపార వర్గాలకు మంచి ప్రోత్సాహక స్థితి, ఆదాయము పెరుగుదల ఉంటుంది. పరిశ్రమలు కొత్త వ్యాపారాలు ప్రారంభించడానికి ప్రభుత్వ ఇతర అనుమతులు లభించగలవు.

## వృశ్చికం


విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ


ఉద్యోగులు శ్రద్ధతో విధినిర్వహణ చేసినా అధికారులకు మీపై అసంతృప్తి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడవచ్చును. అనుకోకుండా ప్రయాణాలు తగులుతాయి. ఖర్చులు అధికం. వృత్తి వ్యాపారాలలో రాబడిపై అసంతృప్తి ఉంటుంది. బంధువుల నుండి పేచీలు రావచ్చును. కోర్టు కేసులు వాయిదా పడతాయి. షేర్లు పెట్టుబడుల మీద లాభాలుంటాయి.

## ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము


ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలుండగలవు. శుభకార్యములు నిర్ణయం కావడం, దూరప్రయాణాలు, కోర్టు వ్యవహారాలు వాయిదాపడటం జరుగవచ్చును. ఈవారంలో వృత్తి వ్యాపారాలలో క్రమంగా ఆదాయం పెరుగుతుంది. భవిష్యత్తులో లాభాల కోసం పెట్టుబడులు పెట్టుతారు. వృత్తిపరంగా కొత్త పరిచయాలు పరిశోధనలుంటాయి. షేర్ మార్కెట్ లాభాలలో ఉంటుంది.

## మకరం


ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు


గడచిన సమస్యలను బయటకు తీసే ప్రయత్నాలు కొందరు మీపట్ల జరుపుతారు. షేర్లు పెట్టుబడుల మీద ఆదాయం ఉంటుంది. అడపాదడపా ఖర్చులు పెరిగినా ఆర్థికంగా పెద్ద ఇబ్బందులుండకపోవచ్చును. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం, ఆదాయం బాగుంటుంది. కొత్త కాంట్రాక్టులు, భాగస్వామ్య పెట్టుబడులకు అవకాశాలు లభించవచ్చును. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు ఉంటాయి.

## కుంభం


ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సెన్సెక్స్ కొద్ది లాభాలనందిస్తాయి. ముఖ్యవిషయాలను ఇతరులకు తెలుపవద్దు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. హామీలు మధ్యవర్తిత్వాల జోలికి వెళ్ళవద్దు. ఇబ్బందులు కలిగే పరిస్థితులున్నాయి. వ్యాపారములు చురుకుగా సాగుతూ ఆదాయాన్ని పెంచుతాయి. అధికారుల ఆదరణ సహకారం బాగుంటుంది. వృత్తిపరంగా పెరుగుదలకు క్రొత్త పథకాలు చేస్తారు.

## మీనం


పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు కొంతమేరకు లభించగలవు. చెల్లింపులు సకాలంలో జరుగుతాయి. అనుకున్న పనులకు ఆటంకాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు తీసికొంటారు. విద్యార్థులకు విద్యా ప్రగతి బాగుంటుంది. స్థానమార్పు, పెట్టుబడి రంగాలలో అవకాశాలు బాగుంటాయి.

# మత సామరస్యతను చాటిన "ముస్లిం యూత్"




నెల్లూరులోని పి.ఎస్.ఎం.సి ఉన్నత పాఠశాలలో ఈనెల 20న ముస్లింయూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు, పెన్సిళ్ళు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం యూత్ నేత ఖాలీద్ మాట్లా డుతూ విద్యార్థులందరూ బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకుని మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంలా భారతదేశ ప్రతిష్ఠను పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూక్ష్మరూపకళాకారులు ముస్సవీర్, ఎస్.ఎస్.బిల్డర్ సుబహాని, మీరా, ఇస్హాఖ్, రేష్మి, సర్దార్, రియాద్ పాల్గొన్నారు.

# ఘనంగా పి.వి వర్ధంతి

మాజీప్రధాని స్వర్గీయ పి.వి.నరసింహారావును కాంగ్రెస్ నాయకులు మరచిపోయారు. వాళ్లకు కాంగ్రెస్‌లో నెహ్రూ కుటుంబీకులు తప్పితే మరో నాయకుడు గుర్తుకురాడు. దేశాన్ని కష్టకాలంలో ముందుకు నడిపిన పి.వి.నరసింహారావు వర్ధంతిని ఈనెల 23న నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. బాలాజీ నగర్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పి.వి.నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బ్రాహ్మణ సంఘ నాయకులు పి.వి.నరసింహారావును వాడుకుని వదిలేసిన కాంగ్రెస్‌ను నానా తిట్లు తిట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రామలింగారెడ్డి, స్థానికులు వెంకటేశ్వరరావు, కనుపర్తి బాలసుబ్రహ్మణ్యం, సంధాని బాషా, ఆకుల హనుమంతరావు, హరి, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

# భజనల ద్వారా భగవంతుడ్ని దర్శించుకుంటాం



**- పరిపూర్ణానందస్వామి**

భజనల ద్వారానే భగవంతుడ్ని దర్శించుకుంటామని, భజనలు గొప్ప సాంప్రదాయమని కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి అన్నారు. స్వామి వివేకానంద 150వ జయంతిని పురస్కరించుకొని జయంతి ఉత్సవ సమితి, ధర్మజాగరణ సమితి, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం భజనబృందాల ప్రదర్శన వైభవంగా సాగింది.

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం వద్ద శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీ రంగనాథుని ఉత్సవమూర్తులను ఊరేగింపుగా చెక్కభజనలు, కోలాటాలు, పండరీభజనలు, నగర సంకీర్తనలతో స్వామివారు ఊరేగారు. రంగనాయకులపేట నుంచి సంతపేట, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ మీదుగా విఆర్‌కళాశాల మైదానానికి చేరుకుంది. మైదానం వద్ద ఏర్పాటుచేసిన వివేకానందుని జయంతి సభలో పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ హిందుత్వం మతంకాదని, ధర్మమని ఆధర్మాన్ని నిలబెట్టు కోవడం ఆచారమన్నారు. ఆర్ఎస్ఎస్‌లాంటి అనేక సంస్థలు హిందూధర్మ ప్రచారాన్ని నలుదిశలా వ్యాప్తి చేస్తున్నాయన్నారు. దాదాపు 3వేల మందితో రాత్రి 9.30గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు అఖండ భజన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సత్యానంద స్వామి మాట్లాడుతూ కొత్త సంవత్సరమంటే మనకు ఉగాదని అన్నారు. తాగితందనాలాడి, ఎగిరిగంతులేసి గడుపుకునేది కొత్త సంవత్సరం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ దువ్వూరు యుగంధర్, అధ్యక్షుడు సామంతు గోపాలరెడ్డి, ప్రధాన కార్యదర్శి కుడుములు అశోకరావు, సభ్యులు సోంపల్లి ఆనందరావు, డా॥సి.వి. సుబ్రహ్మణ్యం, పల్నాటి రామదండు పాల్గొన్నారు.


## 8వ వర్ధంతి



కీ॥శే॥ బొల్లినేని వెంకమ్మ గారు
మామదూరు, చేజర్ల (మం)
జననం : 1-7-1922 మరణం : 26-12-2005

న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ ।
స్థిరబుద్ధిరసంమూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః ॥ 20 ॥

తాత్పర్యము-ప్రియలాభములకు పొంగిపోనివాడును, అప్రియములు ఎదురైనప్పుడు క్రుంగి పోనివాడును, స్థిరమైన బుద్ధి కలవాడును. మోహవివశుడు కాని వాడును అయిన బ్రహ్మవేత్త సచ్చిదానందఘనపరబ్రహ్మపరమాత్మ యందు సదా ఏకీభావస్థితుడైయుండును.

ఎందరికో చేయూతగా, సహాయకారిగా, ఆత్మీయురాలిగా ఎన్నో జీవితాలలో వెలుగునింపిన
'మహా మనీషి' కీ॥ శే॥ బొల్లినేని వెంకమ్మ గారి
8వ వర్ధంతి సందర్భంగా హృదయపూర్వకంగా స్మరించుకుంటూ...
వారి పవిత్రాత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ...

| కుమారులు: | కోడళ్ళు: | మనుమలు - | మనుమరాళ్ళు |
|---|---|---|---|
| బొల్లినేని క్రిష్ణయ్య<br>ME.ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే | సుజాత | | ఐశ్వర్య - వెంకట్రామ్‌చౌదరి |
| బొల్లినేని శీనయ్య<br>MSc.,Ag. | యమున | సందీప్ - హారిక<br>రమణవేద్, ప్రద<br>(మునిమనుమడు, మునిమనుమరాలు) | డా॥ హారిణి - డా॥ అశోక్<br>మేఘవందిత్ (మునిమనుమడు) |
| డా॥ బొల్లినేని భాస్కరరావు<br>M.S.,DNB. CT Surgeon | రాజశ్రీ | డా॥ అభినయ్ - డా॥ శ్వేత<br>అద్విక్ | |
| కుమార్తెలు: | అల్లుళ్ళు: | | |
| తాళ్లూరు లలితమ్మ | పెంచలనాయుడు | గిరి - శివమాల | శశాంక్, రోహన్ (మునిమనుమలు) |
| చప్పిడి పద్మమ్మ | డా॥ జనార్ధననాయుడు | సురేష్ - పద్మజ<br>సంహిత, శ్రీరిషి, (మునిమనుమలు) | రావి జ్యోతి - బాలాజి<br>అవినాష్, శౌర్య (మునిమనుమలు) |

Harsha Ads 9849188889

PDF Compressor Free Version



# లైట్లు వెలగవు... చీకట్లు తొలగవు

రాత్రి అయితేచాలు ఆ దారిన నడవాలంటే భయం, భయం. కారణం వీధిదీపాలు వెలగవు. చిమ్మచీకటిలో ఆ దారిలో విరివిగా సంచరించే పాముల బెడద, దొంగల భయం. ఇది ఎక్కడో మారుమూల గ్రామంలోనో, నగరానికి చివరి ప్రదేశంలోనో కాదు, నేటి నెల్లూరు నగరం నడిబొడ్డైన ప్రదేశంలోనే. ఆశ్చర్యంగా వుందికదా! ఔను, ఆశ్చర్యమేసే విషయమే కాని ఏంచేద్దాం, కార్పొరేషన్ అయిన నెల్లూరు మున్సిపాలిటీలో ఇటువంటి పరిస్థితి వుందా అని ఆశ్చర్యపోకండి. వుంది మరి, ఇది ఎక్కడోకాదు మినీబైపాస్‌లో వుండే మాగుంటలేఅవుట్‌కు తూర్పున వున్న గోమతి స్కూలుకు వెళ్ళే రహదారిలోనే. ఈ స్కూలుకు ముందు నుంచి మినీబైపాస్ వరకు వున్న ఒకే ఒక్క సిమెంటురోడ్డు జీర్ణావస్థకు చేరుకుంది. ఆ రోడ్డుకు ఇరువైపులా వుండే అడ్డరోడ్లలో ఐదు సంవత్సరాల లోపల అపార్ట్‌మెంట్లు వెలిశాయి. వాటిలో నివసించే వారు రాత్రి 7గంటలపైన ఆ దారిన నడిచి రావాలంటే నరకం కనిపిస్తోంది. వీధిలైట్లు సరిపడాలేవు. సరికదా, వున్న రెండు మూడు లైట్లు కూడా వెలగవు. సంవత్సరకాలంలో నెలకోసారి తప్పించి అవి వెలిగిన పాపానపోలేదు. అడ్డరోడ్లు కొన్నింటిలో కరెంటు స్థంభాలు వున్నాయి. కాని వాటికి ట్యూబులైట్లు అమర్చలేదు. కొన్నింటికి అపార్ట్‌మెంట్‌లోని వారే తమ డబ్బులతో అమర్చుకున్నారు. కాని వాటిని సంబంధిత విద్యుత్‌శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడంతో అవీ వెలగక ఆ ప్రాంతవాసులు నానాఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ సిబ్బంది కళ్ళు తెరిచి ఆ వైపు దృష్టిసారిస్తే మంచిది.

# తెలుగుజాతికి ఇది తీరని అవమానం

**- బ్రాహ్మణ మహాసభ అధ్యక్షులు రాళ్ళపల్లి రామసుబ్బారావు**

ప్రధాన మంత్రులుగా పనిచేసి దివంగతులైన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల వర్థంతులను ఘనంగా జరిపే మన ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్‌నాయకులు తెలుగు తేజమైన దివంగత పి.వి.నరసింహారావు వర్థంతి జరుపకపోవడం దారుణమని నెల్లూరుజిల్లా బ్రాహ్మణ మహాసభ అధ్యక్షులు రాళ్ళపల్లి రామసుబ్బారావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేసారు. ఉత్తర భారతదేశానికి చెందిన నేతలు దక్షిణ భారతదేశానికి చెందిన పి.వి.నరసింహారావు పార్థివశరీరానికి చేసిన అవమానం భరించరానిదన్నారు. ఏ హోదా లేకుండా మరణించిన సంజయ్‌గాంధీ అతి తక్కువకాలం ప్రధాని బాధ్యతలు నిర్వహించిన చరణ్‌సింగ్ భౌతికకాయాలను ఢిల్లీలో జవహర్‌లాల్‌నెహ్రూ, లాల్‌బహదూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ పక్కన సమాధిచేయగా, పి.వి.నరసింహారావు పార్థివశరీరాన్ని హైదరాబాదుకు పంపి అగౌరవపరచారని అన్నారు. ఇకనైనా తప్పు గ్రహించి ప్రధానమంత్రిగా విశిష్టసేవలందించిన దివంగత పి.వి.నరసింహారావుకు "భారతరత్న" పురస్కారాన్నిచ్చి గౌరవించాలని, అన్ని ప్రముఖ పట్టణాలలో ఆయన విగ్రహాలను ఆవిష్కరించాలని, ఇది ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఒక్క రాజకీయ నాయకుల, ప్రజల విద్యుక్తధర్మమని పేర్కొన్నారు.



# 28న భామాకలాపం

నెల్లూరు టౌనుహాలులో ఈనెల 28 సాయంత్రం కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో యువ నృత్యకళాకారుడు కె.ఆదర్శ్‌నాయర్‌చే భామాకలాపం నృత్యప్రదర్శన జరుగుతుందని కళాంజలి అనంత్ తెలిపారు. ఆదర్శ్ గురువు వేదాంతం సత్యనర సింహశాస్త్రి పర్యవేక్షణలో ఈ ప్రదర్శన జరుగుతుందని నెల్లూరీయులందరూ వచ్చి విడవలూరు వాస్తవ్యుడైన యువకళాకారుడు ఆదర్శ్‌నాయర్ నృత్యాన్ని తిలకించి ఆశీర్వదించమని కోరారు.

# ఎలక్షన్ కింగ్

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందే అనుకుందాం... సీమాంధ్రలోని 13జిల్లాల్లో జగన్‌కు తిరుగులేదు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానపోటీ వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్యే ఉంటుంది. కాంగ్రెస్ సోదిలోకి కూడా రాదు. తెలుగుదేశంపోటీ ఇచ్చినా అది అధికారానికి దగ్గరకావడం సాధ్యం కాదు. సీమాంధ్రలోని మొత్తం 175అసెంబ్లీ స్థానాలలో దాదాపు 120కిపైగా స్థానాలు జగన్‌పార్టీ దక్కించు కోవడం ఖాయం. సీమాంధ్రలో వరకు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తిరుగులేని శక్తిగా అవతరిస్తుంది. ఒకవేళ రాష్ట్ర విభజన ఆగిపోయి మొత్తం రాష్ట్ర శాసనసభకు యథాతథంగానే ఎన్నికలు జరిగాయనుకుందాం. ఇలా జరిగినా జగన్‌కు ఎదురులేదు. ఎందుకంటే సీమాంధ్రలో 120 నుండి 130సీట్లు జగన్‌కు ఖాయంగా వస్తాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సింది మరో పాతికసీట్లే. తెలంగాణలో జగన్‌కు ఆ సీట్లు ఎలాగూ వస్తాయి. హైదరాబాద్ సిటీతోపాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో వైకాపా బలంగానే ఉంది. మజ్లిస్ వంటి పార్టీ కూడా జగన్‌తో కలిసి రావడానికి సిద్ధంగా వుంది. ఇక ఎంపీ సీట్ల పరంగా చూసినా రాష్ట్ర రాజకీయాల్లో కింగ్ జగనే! రాష్ట్రం విడిపోయినా, కలిసి వుండి ఎన్నికలు జరిగినా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి 20 నుండి 25లోక్‌సభ స్థానాలు వస్తాయి. పలు సర్వేలే ఈ విషయాన్ని చెబుతున్నాయి. రేపు కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా జగన్ మద్దతు అవసరముంటుంది. అప్పుడు రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు, జాతీయ రాజకీయాల్లోనూ ఆయన హవా మొదలవుతుంది. 2012 జగన్‌కు జైలుకు పంపింది. 2013 ఆయనను జైలు నుండి బయటకు తెచ్చింది. 2014 ఆయనను రాష్ట్ర రాజకీయాలలో కింగ్‌ను చేయబోతుంది. ఇది సత్యం.

# ఆనంను వదిలి...

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయి. ఇక్కడ బార్‌ను తొలగించాలని పెంచలరెడ్డి ఉద్యమం చేయగా, ఆయన ప్రయత్నం ఫలించలేదు. పెంచలరెడ్డికి మనసులో ఆ బాధ పడిపోయింది. స్వతహాగా కూడా పెంచలరెడ్డి వై.యస్. అభిమాని. వైకాపా వైపుకు రావడానికి ఆ అభిమానం కూడా కొంత తోడయ్యింది.

నగరంలో ఇప్పటికే మాజీకార్పొరేటర్లు చాలా మంది కాంగ్రెస్‌ను వీడారు. త్వరలో ఇంకొంతమంది ఆనం శిబిరాన్ని వదలబోతున్నారు. నగరంలో కాంగ్రెస్ పార్టీయే కాదు, ఆనం ఆఫీసు కూడా కళావిహీనం కాబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

# కొత్తరాష్ట్రం లేనట్లే

(మొదటిపేజీ తరువాయి)

ముగిసాయి. తెలంగాణబిల్లుపై చర్చకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయకతప్పదు. అయితే కాంగ్రెస్ తప్ప మిగతా పార్టీలన్నీ కూడా తెలంగాణ బిల్లుపై వేడివేడిగానే దాడి చేయనున్నాయి. తెలంగాణకు మద్దతు పలుకుతున్న ప్రధానప్రతిపక్షం బీజేపీ కూడా తప్పుల తడక తెలంగాణ బిల్లుపై మండిపడుతోంది. సమాజ్‌వాదీ, దళ్(యు), అకాలీదళ్, తృణమూల్ కాంగ్రెస్, బిజూజనతాదళ్ వంటి ప్రాంతీయపార్టీలు సైతం ఆర్టికల్-3 దుర్వినియోగంపై ధ్వజమెత్తబోతున్నాయి. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుపై చర్చ సందర్భంగా రచ్చ జరిగే అవకాశముంది. ఇంత రభస మధ్య తెలంగాణబిల్లు ఆమోదం పొందడం కష్టమే. బిల్లుపై చర్చించడానికి గాని ఆమోదించడానికి గాని ఎక్కువ సమయం లేదుకాబట్టి 2014లో తెలంగాణ ఏర్పాటు అనుమానమే.

# నేత్రపర్వంగా క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారం క్రైస్తవ సోదరసోదరీమణులు ఆ మహనీయుడు పుట్టుకతో పరవశించిపోయారు. క్రిస్మస్ సంబరాలను జరుపుకున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న చర్చీలన్నీ విద్యుత్‌దీపకాంతులతో కళకళలాడాయి. తెల్లవారుజామునుంచే కరుణామయుడికి స్వాగతం చెబుతూ పాడిన పాటలు అలరించాయి. పేద, ధనిక తేడా లేకుండా అందరూ ఈ సంబరాల్లో ఆనందంగా పాల్గొన్నారు.



చర్చీలలో క్రైస్తవ కుటుంబీకులందరూ భక్తిపరమైన ఆనంద ఉత్సవాల్లో తేలియాడారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనల్లో తరించారు. పశువులపాకలో ఉన్న బాలఏసును దర్శించుకుని కొవ్వొత్తులు వెలిగించారు. నెల్లూరు నగరంలోని సంతపేట రోమన్ క్యాథలిక్ చర్చి, ఏబియం వద్దనున్న బాపిస్టు చర్చి, విఆర్‌సి సెంటర్‌లోని డానీహాలు, ఫత్తేఖాన్‌పేటలోని లూథరన్‌చర్చి, పొదలకూరురోడ్డులోని సాల్వేషన్‌ఆర్మి చర్చి, వియానిహోం చర్చి తదితర ప్రాంతాల్లోని చర్చిల వద్ద క్రిస్మస్ సంబరాలు ఆనందంగా జరుపుకున్నారు.

## వైభవంగా సప్రం ఉత్సవం

నెల్లూరు సంతపేట సెయింట్ ఆంటోని కెథడ్రిల్ చర్చి వద్ద బుధవారం సాయంత్రం నిర్వహించిన సప్రం ఉత్సవం వైభవంగా జరిగింది. బాలఏసును సప్రంలో ఉంచి సప్రాన్ని వివిధ రకాల పుష్పాలతో విద్యుత్‌ద్దీపాలంకరణతో అలంకరించి, బాణాసంచాలతో ఊరేగింపుగా సంతపేట నుండి నాలుగు కాళ్ళ మండపం, కపాడిపాళెం పురవీధులగుండా చర్చి వద్దకు చేరుకుంది. బిషప్ రెవ డాక్టర్ ఎండి ప్రకాశం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. బిషప్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో నెల్లూరునగర, రూరల్ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి, ఆనం వివేకానంథరెడ్డి, నగరపాలక సంస్థ కమీషనర్ జాన్‌శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా వివేకా 64వ బర్త్‌డే



అభయాంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహిస్తున్న యశ్వంత్‌సింగ్ తదితరులు

నెల్లూరు గ్రామీణఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి 64వ జన్మదిన వేడుకలను 23వ తేదీ ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. మూలాపేట శివాలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో వివేకా పేరిట పాలాభిషేకం, అర్చనలు నిర్వహించారు. వివేకా బర్త్‌డే కేక్‌ను కోసి అందరికీ పంచిపెట్టారు. పేదలకు ప్రసాదాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో బెజవాడ మేఘనాథ్‌సింగ్, సూరిశెట్టి నరేంద్ర, దినేష్‌రెడ్డి, నిరంజన్, సూర్యనారాయణ, మైఖేల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుక్కలగుంటలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో వివేకా జన్మదిన వేడుకలు జరిగాయి. వివేకా పేరుతో పూజలు నిర్వహించారు. భారీఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో విజయ్, శివ, శరత్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అలాగే నెల్లూరులోని జూబ్లీ ఆసుపత్రిలో సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసీ జిల్లా కన్వీనర్ డి.అంజయ్య ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేసారు. సిటీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో రేబాల చిన్నపిల్లల ఆసుపత్రిలో పిల్లలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసారు. వివేకా జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు నగరంలో వివిధ రకాల వివేకా ఫోటులతో ఫ్లెక్సీకటౌట్‌లు ఏర్పాటు చేసారు.

### భారత హ్యాండ్‌బాల్ కమిటీ

# ఛైర్మన్‌గా కొండలరావు



భారత హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ టెక్నికల్ కమిటీ ఛైర్మన్‌గా రాష్ట్ర జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సి.కొండలరావు ఎన్నికయ్యారు. ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో మంగళవారం జరిగిన భారతహ్యాండ్‌బాల్ ఫెడరేషన్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొన్న కొండలరావు రాష్ట్రం నుంచి టెక్నికల్ కమిటీ ఛైర్మన్‌గా, కార్యవర్గసభ్యులుగా ఫెడరేషన్‌లో స్థానం సంపాదించారు. నెల్లూరుజిల్లా పొదలకూరుకు చెందిన కొండలరావు ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా 35ఏళ్ళపాటు క్రీడారంగంలో విశేషసేవలు అందించారు. కొండలరావు ఎన్నికపట్ల వీఎస్‌యూ ఫిజికల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మూర్తి, వీఎస్‌యూ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం అధ్యక్షుడు ఎం.రవీంద్రబాబు, ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి తదితరులు అభినందించారు.

# శుభమస్తు షాపింగ్‌మాల్‌లో ఆఫర్ల మేళా

క్రిస్టమస్, న్యూఇయర్ మరియు సంక్రాంతి పండుగల సందర్భంగా నెల్లూరు విఆర్‌సి కూడలిలోగల "శుభమస్తు" షాపింగ్‌మాల్‌లో ఇప్పటివరకు ఎవ్వరూ ఇవ్వని విధంగా వినియోగదారులకు పూటకో పట్టుచీర, వారానికో నానోకారు బహుమతులు ప్రకటించింది.

ప్రతిరోజు జరిగే డ్రాలో గెలుపొందిన వారికి 3950/-రూ॥ల విలువ కలిగిన 2పట్టుచీరలను మరియు వారానికి ఒకసారి జరిగే బంపర్‌డ్రాలో గెలుపొందిన వారికి 2,02,065రూ॥ల విలువగల 6నానోకారులను 6వారాల పాటు ఇస్తున్నారు. ఈ పండుగల సందర్భంగా లక్కీడ్రాలో కాకుండా 1ప్లస్1 ఆఫర్లు, 2ప్లస్1 ఆఫర్లు, అద్భుతమైన కలెక్షన్స్‌తో "శుభమస్తు" షాపింగ్‌మాల్ ముస్తాబు అయ్యింది.

కావున వస్త్రాభిమానులు ఈ అవకాశాలను, ఆఫర్లను సద్వినియోగం చేసుకోవలసినదిగా షోరూం అధినేతలు బి.వి.రమణయ్య, బయ్యా వాసు, బయ్యా రవి, బయ్యా రాణాప్రతాప్‌లు కోరుతున్నారు.

PDF Compressor Free Version



# గూడూరు డివిజన్ వార్తలు

## సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీవోకు వినతి పత్రం సమర్పిస్తున్న గూడూరు డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం

గూడూరు డివిజన్‌లోని గ్రామ రెవెన్యూ అధికారులు సమస్యలను పరిష్కరించాలని గూడూరు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గూడూరు డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ అధ్యక్షులు కార్యదర్శులు కె.వెంకటేశ్వర్లు, గిద్దలూరు రమణయ్యలు మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లోని గ్రామ రెవెన్యూ అధికారులందరికీ మార్కెట్ విలువకు ఇంటి నివేశస్థలములు మంజూరుచేయమని డివిజన్‌లోని 9మండలాలకు సంబంధించిన సిజెఎఫ్‌యస్ లబ్ధిదారుల ఒరిజినల్ కాపీ మరియు సీలింగ్ భూముల వివరములు జాబితాలను సంబంధిత గ్రామరెవెన్యూ అధికారులకు అందజేయాలన్నారు. గ్రామరెవెన్యూ అధికారుల సమస్యలపైన మరియు గ్రామరెవెన్యూ రికార్డుల పైన డివిజన్ సమావేశము నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని గ్రామరెవెన్యూ అధికారులపైన ఇటీవల కాలములో రాజకీయ ఒత్తిళ్ళు మరియు దాడులు జరుగుతున్నాయని ఆవేదన చెందారు. గ్రామరెవెన్యూ అధికారులు అందరికీ కంప్యూటర్‌పై అవగాహన కోసం కనీసం 15రోజులు శిక్షణ ఇప్పించాలని పట్టాదారు పాసుబుక్కులు, టైటిల్ డీడ్‌మంజూరు విషయంలో జరిగే జాప్యంలో గ్రామరెవెన్యూ అధికారులను మాత్రమే బాధ్యులను చేస్తున్నారని, 1422 ఫసలీకి సంబంధించిన అడంగల్ కాపీలను ఇప్పించాలని, గ్రామరెవెన్యూ అధికారులపైన పనిభారం ఎక్కువగా ఉన్నదని, వీటిని దృష్టిలో పెట్టుకుని మానసిక ఒత్తిళ్ళకు గ్రామరెవెన్యూ అధికారులు గురవుతున్నారని, దీనిని పరిశీలించి గ్రామరెవెన్యూ అధికారులపై ఒత్తిళ్ళను తగ్గించవలసినదిగా కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జి.హరినారాయణ రెడ్డి, కన్నెదారి రవిశేఖర్, వి.చంద్రశేఖర్ మరియు సభ్యులు హనుమంతయ్య, ఉమా మహేష్, కె.రామకృష్ణ, ఎం.రమేష్‌నాయుడు, శ్రీనివాసులు, భక్తవత్సలం పాల్గొన్నారు.

## వ్యాపారులకు న్యాయం చేయండి

గూడూరు ఆసుపత్రి ప్రాంతంలో రోడ్డుపక్కన వ్యాపారం చేసుకొనే వారికి ఇబ్బంది లేకుండా చూడాలంటూ పలువురు సోమవారం గూడూరులో మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. రోడ్డుపక్కన వ్యాపారం చేయకూడదని పురపాలకసంఘ అధికారులు చెబుతున్నారని సామాగ్రిసైతం తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో కోర్టు కూడా రోడ్డు పక్కన వ్యాపారం చేసుకొనే వారిని కమిటీగా ఏర్పాటుచేసి వారిని అనుమతివ్వాలని తెలిపిందని చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను కమీషనర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సురేంద్ర, ఉడతాశరత్, రవీంద్రరెడ్డి, వ్యాపారులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

### ఆర్డీవోకు బాధితుల మొర

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న సమస్యలను పరిష్కరించి న్యాయంచేయాలని పలువురు బాధితులు ఆర్డీవో మధుసూదనరావుకు విన్నవించుకొన్నారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం జరిగింది. ఈ సందర్భంగా చిల్లకూరు మండలం కలవకొండ ప్రాంతానికి చెందిన రైతులు ఆర్డీవోను కలసి వినతిపత్రం సమర్పించారు. దక్కిలి మండలం మాటుమడుగు చౌకదుకాణాన్ని బినామీ నడుపుతున్నారని, వారిపై చర్యలు తీసుకోమని ఆర్డీవోను కలిసారు. ఇంకనూ పలువురు వివిధ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.

## విందూరు గ్రామస్థుల ధర్నా



ఎంపిడివో కార్యాలయం వద్ద బైఠాయించిన గ్రామస్థులు

గూడూరు మండలంలోని విందూరు గ్రామంలో గత మూడు రోజులుగా తాగునీటిని నిలిపివేయడంతో ఆగ్రహించిన గ్రామస్థులు సోమవారంనాడు ఎంపిడివో కార్యాలయం వద్ద ధర్నాచేపట్టారు. గ్రామంలో 20వతేదీ నుంచి సర్పంచ్ తాగు నీటి సరఫరాను ఆపేశారంటూ గ్రామస్థులు, వార్డు సభ్యులు గత శనివారం ఎంపీడీవో నిర్మలాదేవికి ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడం, గ్రామంలో ఆదివారం పైపులైనును ధ్వంసం చేయడంతో ఆగ్రహించిన గ్రామస్థులు అధికారుల తీరుకు నిరసనగా ఎంపిడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామంలో తాగునీటిని సరఫరా చేసే వరకు వెళ్లమని భీష్మించుకోవడంతో వెంటనే కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని అధికారులు గ్రామానికి పంపడంతో ధర్నా విరమించారు. అంతకు ముందు పైపుల ధ్వంసంపై ఉపసర్పంచి, వార్డు సభ్యులు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ధర్నాలో స్థానికులు పెంచలరెడ్డి, నారాయణరెడ్డి, మధురెడ్డి వైకాపా నాయకులు నాసిన నాగులు, రాధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ పథకాలకు చట్టబద్ధత కల్పిస్తాం

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తాము ప్రవేశపెట్టిన పథకాలను తొలగించేందుకు వీల్లేకుండా చట్టబద్ధత కల్పించినట్లు రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. సైదాపురం మండలంలో ఆదివారం మంత్రి పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ పేదల కోసం ప్రవేశపెడుతున్న పథకాలకు చట్టబద్ధత కల్పించి అమలు చేస్తున్నామన్నారు. జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం, ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక పథకాలను ఈ విధంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక పథకం ద్వారా రాష్ట్రంలో 26మంది యువకులను విదేశీ చదువుల కోసం పంపించామన్నారు. బంగారుతల్లి పథకంలో రాష్ట్రంలో 28వేల మందికి 670కోట్లు అందజేశామన్నారు. ఎంపి చింతామోహన్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ సైదాపురం సమీపంలోని కైవల్యానదిపై ఎన్ని అవరోధాలు ఎదురైనా ఎదురొడ్డి పోరాడి వంతెన నిర్మాణం పూర్తిచేసామన్నారు. అలాగే గూడూరు-రాజంపేట రహదారిని రెండులైన్లుగా మార్చేందుకు తమవంతు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షులు ధనుంజయరెడ్డి, మాజీ ఎమ్మెల్యే యల్లసిరి శ్రీనివాసులురెడ్డి, సైదాపురం సర్పంచి వెంకటేశ్వరరెడ్డి, మన్నారపు రవి, మాజీమండల ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.




డా॥ సి.మధుసూదనరెడ్డి

జననం: 04.11.1950 మరణం: 31.12.2005

స్మృత్యంజలి

ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి,
మీరు మాకు దూరమై ఎనిమిదేళ్ళు గడుస్తాయి.

మరపురాని మీ మధురస్మృతులతో...

తండ్రి : చిట్టమూరు పద్మనాభరెడ్డి
మాజీ వైస్‌ఛైర్మన్, జిల్లా పరిషత్, నెల్లూరు.
తల్లి : చిట్టమూరు అనసూయమ్మ
భార్య : డాక్టర్ చిట్టమూరు భారతి
కుమారుడు : చిట్టమూరు లోహిత్
కుమార్తె : చిట్టమూరు ప్రణీత
చెల్లెలు : నిర్మల
బావ : డా॥ సి.యం.కె.రెడ్డి
మరియు కుటుంబసభ్యులు

PDF Compressor Free Version



# పేటకు సంజీవయ్య

## జిల్లాలో అన్ని స్థానాల్లో వైసిపి అభ్యర్థుల ఖరారు

# గూడూరుకు సునీల్





జిల్లాలోని రెండు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాలైన సూళ్లూరుపేట, గూడూరులకు వైకాపా అభ్యర్థులు ఎవరనే విషయం నిన్నటివరకు తేల్చలేదు. జిల్లాలోని మిగతా 8నియోజకవర్గాలకు ఒక్కొక్కరినీ సమన్వయకర్తలుగా నియమించడంతో రేపటి ఎన్నికల్లో అభ్యర్థులు కూడా వారేనని తేలిపోయింది. అయితే వాటికి భిన్నంగా గూడూరుకు పాశం సునీల్‌కుమార్, డాక్టర్ చెంతాటి బాలచెన్నయ్యలను, సూళ్లూరుపేటకు కె.సంజీవయ్య, మాజీఎమ్మెల్యే నెలవలసుబ్రహ్మణ్యం, దబ్బల రాజారెడ్డిలను సమన్వయకర్తలుగా నియమించడం జరిగింది. దీంతో ఎవరికి సీటు అనే విషయమై నిన్నటిదాకా సందిగ్ధత నెలకొంది. అయితే ఇటీవల పార్టీపరంగా నిర్వహించిన సర్వేలో సూళ్లూరుపేటకు సంజీవయ్య, గూడూరుకు పాశం సునీల్‌కుమార్ బెటర్ అని తేలినట్లు తెలుస్తుంది.

సూళ్లూరుపేటలో చూస్తే మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యంకు అంత మంచి పేరు లేదు. గతంలో ఎమ్మెల్యేగా చేసి ఆయన ఇక్కడ పొడిచిందేమీ లేదు. ఆయన పనితీరు పట్ల తీవ్ర వ్యతిరేకత వుంది. అన్ని వర్గాల వారిని కలుపుకుపోడనే చెడ్డపేరుంది. సంజీవయ్య చూస్తే వివాదరహితుడిగా మంచిపేరుంది. ఆయన మామ మాజీమంత్రి పసల పెంచలయ్యకు ఈ నియోజకవర్గంలో మంచి పేరుంది. ఇటీవల ఆయన కూడా కాంగ్రెస్‌ను వదిలి వైకాపాలో చేరారు. నెలవల కంటే బెటర్ అన్న కోణంలోనే సంజీవయ్యకు సూళ్లూరుపేట సీటు ఖరారు చేసారని తెలుస్తుంది.

ఇక గూడూరులో చూస్తే పాశం సునీల్‌కుమార్ స్థానికుడు, యువకుడు, గతంలో మున్సిపల్ ఛైర్మెన్‌గా పనిచేసి వున్నాడు. పార్టీ కార్యక్రమాలలో చురుకుగా దూసుకుపోగలడు. ముఖ్యంగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అండదండలున్నాయి. ఇక్కడ అన్ని విధాలా పాశం సునీల్ మెరుగైన అభ్యర్థి అని తేలడంతో ఆయనకే పచ్చజెండా ఊపినట్లు సమాచారం.



పాశం సునీల్‌ను అభినందిస్తున్న గూడూరు వైకాపా నాయకులు

# ఢిల్లీ గద్దెపై ఆప్




ఢిల్లీ రాజకీయాలలోకి తుఫాన్‌లా దూసుకొచ్చి జాతీయ రాజకీయాలలోనే సునామీని సృష్టించి, కాంగ్రెస్‌పార్టీని చావలా చుట్టేసిన ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించుకుంది. దీంతో ఢిల్లీలో ప్రజలు కోరుకున్నట్లే సామాన్యుడి ప్రభుత్వం ఏర్పడబోతుంది. ఈ నెల 28న ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రమాణస్వీకారం చేయబోతున్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టుకే ఓ సంచలనం. అవినీతిపై యుద్ధభేరీ మోగిస్తూ జనలోక్‌పాల్ బిల్లు కోసం శాంతియుత ఉద్యమానికి నడుంబిగించిన అన్నాహజారే బృందంలోని సభ్యుల్లో ఒకరు అరవింద్ కేజ్రీవాల్. సామాన్యులకు భారంగా మారుతున్న రాజకీయాలలో సామాన్యుడినే పరిపాలకుడిగా చేయాలని భావించి ఢిల్లీ కేంద్రంగా ఆయన ఆమ్‌ఆద్మీ పార్టీని స్థాపించారు. చీపురుకట్టను తమ పార్టీ గుర్తుగా మలచుకుని ఢిల్లీలో రాజకీయ ప్రక్షాళనకు చీపురు కట్టలు పట్టుకుని బయల్దేరారు. అరవింద్ కేజ్రీవాల్ అనే వ్యక్తితో మొదలైన ఆమ్ ఆద్మీ ఢిల్లీలో ఓ పెద్ద రాజకీయశక్తిగా, ప్రత్యామ్నాయ వ్యవస్థగా తయారైంది. ఢిల్లీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్‌పై పోటీచేసి ఆమెను ఓడిస్తానన్న అరవింద్ కేజ్రీవాల్, అన్నట్లే నిన్నటి ఢిల్లీ ఎన్నికల్లో తన మాటను నిలబెట్టుకున్నాడు. ఢిల్లీలో మూడుసార్లు కాంగ్రెస్‌ను గద్దెనెక్కించడంలో కీలకపాత్ర పోషించిన షీలాదీక్షిత్, నాలుగోసారి అరవింద్ కేజ్రీవాల్ చేతిలో ఓడిపోయింది. మొన్నటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 32సీట్లతో బీజేపీ పెద్ద పార్టీగా అవతరించగా ఆమ్‌ఆద్మీ సంచలనాత్మకంగా 28సీట్లు సాధించింది. అధికార కాంగ్రెస్ 8సీట్లతో సరిపెట్టుకుంది. పూర్తి మెజార్టీ ఎవరికీ రాలేదు. బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రాలేదు. ఆమ్‌ఆద్మీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే మద్దతునిచ్చేందుకు కాంగ్రెస్ ముందుకొచ్చింది. ఏ కాంగ్రెస్ అవినీతి మీదయితే అరవింద్ కేజ్రీవాల్ ఇంతవరకు పోరాడాడో ఇప్పుడు అదే కాంగ్రెస్ మద్దతుతో ఆయన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. అరవింద్ కేజ్రీవాల్‌కు అసలైన సవాల్ ఇక్కడనుండే మొదలవుతుంది. ఇప్పటివరకు బయట ఉండి ఆయన అధికారపార్టీ మీద రాళ్లు విసురుతూ వచ్చాడు. ఇప్పుడు అవే రాళ్లు తన మీద పడకుండా ఆయన పరిపాలన సాగించాల్సివుంది.

న్యూ ఇయర్, సంక్రాంతి అతిపెద్ద సేల్
UPTO 50% OFF
శారీస్, సల్వార్స్, గాగ్రాస్, డ్రస్ మెటీరియల్స్, లేడీస్ వెస్టన్‌వేర్, మెన్స్‌వేర్ & టెక్స్‌టైల్స్ పై
కళానికేతన్® షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్ 2316677
*Conditions Apply

నూతన సంవత్సర మరియు ఓం సంక్రాంతి శుభాకాంక్షలు
మా "మురళీకృష్ణ" నేతి మిఠాయిలతో మా ఆత్మబంధువులు, కస్టమర్ దేవుళ్ళు అందరూ
ఈ నూతన సంవత్సరాన్ని ఆనందంగా, తియ్యతియ్యగా ప్రారంభించాలని కోరుకుంటూ...
స్వీట్స్ గిఫ్ట్‌ప్యాకింగ్ బాక్స్‌లలో లభించును
డిసెంబర్ 31 మరియు జనవరి 1వ తేదీ మాత్రమే
మురళీకృష్ణ నేతిమిఠాయిలు
మద్రాస్‌బస్టాండ్ దగ్గర, నెల్లూరు. ఫోన్. 2336616, 2326888.
మరియు ఆర్టీసీ ఎదురుగా వున్న మురళీకృష్ణ ఘీస్వీట్స్ మరియు మాగుంట లే అవుట్‌లోని
"నిర్వాణ రెస్టారెంట్" నందు కూడా లభించును. ఫోన్: 2346544.



Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.